# ప్రజా తపన

prajathapana.com

*News that matters*





సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 26 మంగళవారం 07 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# కలవరపెడుతున్న హెచ్ 1 బీ వైరస్

**ప్రజాతపన ,ముంబై :**



దేశంలో కొత్త వైరస్ కలకలం రేపుతోంది. ప్రస్తుతం హెచ్3ఎన్2 పేరుతో కొత్త వైరస్ భయాందోళనకు గురి చేస్తోంది. అనేక మందిలో కొత్త వైరస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇది కొత్త వైరసుల ఉపరకం అని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎమ్ఆర్) ధృవీకరించింది. అధిక సంఖ్యలో జనం ఆస్పత్రుల్లో చేరడానికి ఈ వైరస్ కారణమవుతుందని ఐసీఎమ్ఆర్ తెలిపింది. ఉష్ణోగ్రత పెరగడం ప్రారంభం కావడంతో ఈ వైరస్ ఇన్ ఫెక్షన్ల సంఖ్య మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారం నుంచి తగ్గే అవకాశం ఉందని ఐసీఎమ్ఆర్ అంటోంది. హెచ్3ఎన్2తో ఆస్పత్రుల్లో చేరిన రోగుల్లో 92 శాతం మంది రోగులకు జ్వరం, 86 శాతం మంది రోగులకు దగ్గు, 27 శాతం మందికి శ్వాస ఆడకపోవడం, 16 శాతం మందికి శ్వాస లోపం ఉన్నట్లు గుర్తించారు. దీనికి అదనంగా 16 శాతం మంది రోగులకు నిమోనియా, 6 శాతం మందికి మూర్ఛ సమస్యలు ఉన్నాయని ఐసీఎమ్ఆర్ పరిశీలనలో వెల్లడైంది. హెచ్3ఎన్2తో బాధపడుతున్న వారిలో 10 శాతం మంది రోగులకు ఆక్సిజన్, 7 శాతం మందికి ఐసీయూ సంరక్షణ అవసరమని ఐసీఎమ్ఆర్ అభిప్రాయపడింది. ఈ మధ్య కాలంలో ప్రతి ఇంట్లో ముఖ్యంగా పెద్దవారిలో, చిన్నపిల్లల్లో జలుబు, జ్వరం, దగ్గుతో బాధపడుతున్నారు. ఇది రెగ్యులర్ గా ఉంటే నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్లు చెబుతున్నారు. దీనికి ఇన్ ఫ్లూయెంజా వైరస్ కారణమని గుర్తించారు. దీన్ని హెచ్3ఎన్2 అనే వేరియంట్ గా ఐసీఎమ్ఆర్ గుర్తించింది. దీని ప్రభావంతో ఎక్కువ శాతం మంది తీవ్రమైన దగ్గు, ఊపరితిత్తుల సమస్యల బారని పడుతున్నారని తెలిపారు.



## ప్రమాణ స్వీకారాలకు ప్రధాని

**న్యూఢిల్లీ :**

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడబోతున్న సంగతి తెలిసిందే. మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ ఆధ్వర్యంలోనే కొత్త ప్రభుత్వాలు కొలువుదీరబోతున్నాయి. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వాల ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవ్వబోతున్నారు. ఈ విషయాన్ని బీజేపీ వర్గాలు ధృవీకరించాయి. మోదీతోపాటు కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, ఇతర బీజేపీ సీనియర్ నేతలు ఈ కార్యక్రమాలకు హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నేతల దగ్గరి నుంచి మోదీ సహా అతిథులకు ఆహ్వానాలు అందాయి.

(మిగతా 2లో)

## షెహబాజ్ షరీఫ్ వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారు

### పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్

**ఇస్లామాబాద్ :**

పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాటి పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ బాజ్వా దయతో ప్రధాని అయ్యారని ఇమ్రాన్ చెప్పారు. షెహబాజ్ షరీఫ్ వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పాకిస్థాన్ అంతర్జాతీయంగా విమర్శల పాలైందన్నారు. ప్రపంచ దేశాల వద్దకు వెళ్లి పాక్ అడుక్కుంటోందని ఇమ్రాన్ వాపోయారు. పాక్ ఆర్థిక పరిస్థితి కుప్పకూలిపోయిందన్నారు. పనిలో పనిగా ఆయన ఆసిఫ్ జర్దారీపైన కూడా విమర్శలు చేశారు. ఆసిఫ్ జర్దారీ ఓ హంతకుడని ఇమ్రాన్ ఆరోపించారు.

మరోవైపు ఇమ్రాన్ ఖాన్ తోషఖానా కేసు లో అరెస్టయ్యే అవకాశం ఉంది. పోలీసులు నాన్-బెయిల్‌బుల్ అరెస్టు వారెంట్‌తో లాహోర్‌లోని జమాన్ పార్క్ నివాసానికి చేరుకున్నారు. దీంతో ఇమ్రాన్ మద్దతుదారులు, పాకిస్థాన్ తెహ్రిక్-ఇ-ఇన్సాఫ్ కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఇమ్రాన్ నివాసం వెలుపల హైడ్రామా



నెలకొంది. ఇమ్రాన్ మద్దతుదారుల నినాదులు, నిరసనలతో పోలీసులు ముందుకు వెళ్లలేకపోయారని వార్తలు వచ్చాయి.

తోషఖానా కేసు విచారణకు ఇమ్రాన్ పదేపదే గైర్హాజరు అవుతుండటంతో ఆయనకు

(మిగతా 2లో)

# ఏప్రిల్ 1 నుంచి టోల్ చార్జీల పెంపు

**ముంబై :**

భారతీయులపై మరో పిడుగు పడనుంది! దేశవ్యాప్తంగా త్వరలోనే టోల్ ఛార్జీలు భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. జాతీయ రహదారుల్లోని టోల్ ప్లాజాల్లో.. ఏప్రిల్ 1 నుంచి టోల్? ఛార్జీలను 5శాతం నుంచి 10శాతం వరకు పెంచే యోచనలో ఎన్‌హెచ్ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) ఉన్నట్టు సమాచారం. 2008 నేషనల్ హైవేస్ ఫీ రూల్స్ ప్రకారం.. ప్రతి యేటా ఏప్రిల్




1న.. టోల్ ఛార్జీలను సవరించాల్సి ఉంటుంది. ఇక ఇప్పుడు టోల్? ఛార్జీలను పెంచాలన్న ప్రతిపాదనపై.. కేంద్ర రోడ్డు, రవాణాశాఖ.. ఈ నెల చివర్లో ఓ నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. కార్లు, లైట్? వెయిట్? వాహనాల టోల్ ఛార్జీలు కనీసం 5శాతం పెరిగే అవకాశం. ఇక హెవీ వెహికిల్స్‌కి అయితే టోల్ ఛార్జీలు కనీసం 10శాతం వరకు పెరగొచ్చు. ఇటీవలే లాంచ్? అయిన ఢిల్లీ- ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపైన కూడా టోల్ ఛార్జీలు పెరుగుతాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక్కడ ప్రస్తుతానికైతే..

(మిగతా 2లో)




## అ సెంబ్లీ సమావేశాల్లో రాజధాని బిల్లు...?

**విజయవాడ :**

ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై క్లారిటీ వచ్చేసింది. మార్చి 14వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ కార్యదర్శి శుక్రవారం నోటిఫికేషన్ జారీచేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి సంబంధించి ఉభయ సభలనూ ఉద్దేశించి 10 గంటలకు రాష్ట్ర గవర్నర్ ప్రసంగిస్తారు. ఇక శాసనమండలి సమావేశాలు కూడా మార్చి 14వ తేదీనే ప్రారంభం కానున్నాయి. ఇక కీలకమైన బడ్జెట్ ను మార్చి 17వ తేదీన ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. మార్చి 15వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చించడంతో పాటు సీఎం కూడా మాట్లాడే అకాశం ఉంది. ఈ తేదీలపై క్లారిటీ

(మిగతా 2లో)

# ఉగ్రమూలాలపై ముప్పేట దాడి

**శ్రీనగర్ :**

పాకిస్తాన్ దివాలా తీసింది. పాక్ అండదండలతో చెలరేగిపోయి భారత్‌పై దాడులకు తెగబడే ఉగ్రమూకలు ఇప్పుడు సాయమందక దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఇదే మంచి సమయం అని భావిస్తున్న భారత ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టింది. పాకిస్థాన్‌లో ఉంటూ భారత్‌లో అరాచకం సృష్టిస్తున్న ఉగ్రవాదులకు కళ్లెం వేసే పని చేపట్టింది కేంద్ర ప్రభుత్వం. కశ్మీర్‌కు చెందిన కొందరు ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో కూర్చొని భారతదేశంలో అరాచకాలు సృష్టిస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు 168 మంది ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని రోజువారీ ఖర్చులకు పాకిస్తాన్ తల్లడిల్లుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉగ్రమూకలకు ఆర్థిక సాయం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఉగ్రవాద నాయకులకు తమ శిక్షణా కేంద్రాలు నడిపించేందుకు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. పాక్ నుంచి వచ్చే డబ్బుతో వారు ఇన్నాళ్లు ఇండియాలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం పనిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో పాక్‌లో తిష్టవేసిన తీవ్రవాద నాయకులు కశ్మీర్‌లో ఉన్న తమ ఆస్తులు అమ్మాలనే ఒత్తిడి పెరుగుతోంది. ఆ డబ్బుతో కొన్నాళ్ల పాటు మనుగడ సాగించాలన్నది ఈ తీవ్రవాద నేతల ఆలోచన. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ, ఎన్ఐయేవంటి ఏజెన్సీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఉగ్రవాదులకు నిధులు అందే మార్గాలను దాదాపు మూసేశాయి. తాజాగా ఈ విధానంలో కొంత



మార్పు చేస్తూ ఉగ్రవాదులకు చెందిన ఆస్తుల జప్తుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 90వ దశకం నుంచి పరారీలో ఉన్న ఉగ్రవాదులపై కేంద్రం చర్యలకు ఉపక్రమించి చాలా కాలమవుతోంది. వీరందరిని యూయేపీయే చట్టం కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. దాన్ని కొనసాగింపుగా ఇప్పుడు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠిన చర్యలకు దిగుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇలా ప్రకటించిన ఉగ్రవాదుల పేర్లతో ఉన్న ఆస్తులను జప్తు చేస్తున్నారు. అలాగే వారు అక్రమంగా ఏదైనా ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్టు అయితే వాటిని బుల్‌డోజ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ గతేడాది డిసెంబర్ 31న మొదలైంది. దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ పహాల్‌గావ్ పరిధిలోని లీవర్ గ్రామానికి చెందిన కరుడుగట్టి ఉగ్రవాది గులాంనబీ ఖాన్ అలియాస్ అమీర్ ఖాన్ ఆస్తుల జప్తుతో ఈ ప్రక్రియకు కేంద్రం శ్రీకారం చుట్టింది. మార్చి మొదటి వారంలో ఈ చర్యలను కేంద్రం

(మిగతా 2లో)

ప్రజా తపన
prajathapana.com

# తులసిదాస్ హనుమాన్ చాలీసాను హిందీ నుండి తెలుగులోకి అనువదించిన

# గేయ రచయిత ఎమ్మెస్ రామారావు



**-నేడు ఆయన జయంతి**

ఎమ్మెస్ రామారావు పూర్తిపేరు మోపర్తి సీతారామారావు. ఈయనకు సుందర దాసు అనే బిరుదు ఉంది. ఈయన తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకుడు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తాహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించాడు. గేయ రూపంలో ఈయన రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము ఎమ్మెస్ రామారావు సుందరకాండ గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఈ రెండూ ఈయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.తొలినాళ్లు ఎమ్మెస్ రామారావు 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య మరియు మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో మరియు గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. రామారావు గారికి 1942 లో లక్ష్మి సామ్రాజ్యంతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె (వెంకట సరోజిని) మరియు ఇద్దరు కుమారులు (బాబూరావు, నాగేశ్వరరావు) సినీరంగంలో ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించారు. ఆ చిత్రంలో నాయక పాత్ర ధరించిన సి.హెచ్. నారాయణరావుకు ఇది గాత్రదానం. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. తరువాత ఈయన దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసించిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాంతంలో కొన్ని కారణాల వల్ల మద్రాసు వదిలి రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువదించారు మరియు తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయరచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరాబాదులో సహజ కారణాల వల్ల మరణించాడు.

## వెలుగులోకి 16వ శతాబ్దం నాటి వినాయకుని విగ్రహం

**ప్రజాతపన :కడప :**



మైదుకూరు మండలం ఉత్సలవరం గ్రామంలో 16వ శతాబ్దం నాటి వినాయకుని విగ్రహం గుర్తించినట్లు చరిత్ర పరిశోధకులు ,రచయిత బొమ్మిశెట్టి రమేష్ సోమవారం మీడియా కు తెలిపారు..బొమ్మిశెట్టి మాట్లాడుతూ ఈ విగ్రహ%శీ% పుట్టా రామకృష్ణ ,శీను ల పశు వుల జాగాలో తూర్పు వైపు ఉందని తెలిపారు. ఆ శతాబ్దంలో ఇక్కడ దేదీప్యమానంగా వినాయకుని ఆలయ%శీ% వెలుగుందన్నారు. కాలక్రమేనా ఈ దేవాలయం శిథిలావస్థకు చేరి వినాయకుని ప్రతిమ కొంత వరకు మాత్రమే కనబడుతూ వచ్చిందన్నారు.గుప్తనిధుల కోసం తవ్వడంతో వినాయకుని విగ్రహం పూర్తిగా పైకి కనబడుతోందనీ తెలిపారు.ఈ విగ్రహంలో ఎడమ చేతిలో శంఖ%శీ% , కుడి చేతిలో డమరుకం ఉన్నట్లు రమేష్ వివరించారు.విగ్రహం గురించి గ్రామ స్థానికుడు సుంకర మధుసూదన్ రెడ్డి తనకు చెప్పడంతో విగ్రహాన్ని పరిశీలించాలని బొమ్మిశెట్టి చెప్పారు..
మైసూర్ పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి విగ్రహం గురించి చెప్పానని రమేష్ తెలిపారు.దీంతో డైరెక్టర్ నిశితంగా పరిశీలించి ఇది 16వ శతాబ్దందని తేల్చి చెప్పినట్టు రమేష్ విశ ధికరించారు..

## జాతీయ సమైక్యతా శిబిరానికి బాలయేసు విద్యార్థిని ఎంపిక.

**ప్రజా తపన హిందూపురం**




శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న బాలయేసు డిగ్రీ కళాశాల విద్యార్థిని కుమారి భార్గవి "జాతీయ సమైక్యతా శిబిరానికి" అర్హత సాధించినట్లు విశ్వ విద్యాలయ ఎన్.ఎస్.ఎస్. సమన్వయ కర్త డాక్టర్. మురళీధర రావు తెలిపారు. ఇలాంటి అరుదైన అవకాశం అందుకున్న భార్గవిని మునిసిపల్ వైస్ చైర్మన్ యం. బలరామి రెడ్డి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ నెల15 నుండి 21 తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన భార్గవి ని ప్రిన్సిపాల్ శ్రీనాథ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు అశ్వత్త నారాయణ, రఘు,రమేష్,హరీష్ లు పుష్పగుచ్ఛంతో శు భాకాంక్షలు తెలిపారు.

## అ సెంబ్లీ సమావేశాల్లో రాజధాని బిల్లు...?

(మొదటిపేజీ తరువాయి)

రావాల్సి ఉంది. అయితే బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశంలో సభ ఎన్నిరోజులు నిర్వహించాలి, ఏ అంశాలపై చర్చించాలనే అంశాలను నిర్ణయించనున్నారు. 14 నుంచి 24వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెట్టాలనే అంశాన్ని బీఏసీ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు.నిజానికి ఎమ్మెల్సీ ఎన్నికల పూర్తి అయిన తర్వాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ఏపీ సర్కార్ యోచించింది. ఎన్నికలతో సంబంధం లేకుండా... సభను నిర్వహించేందుకు సిద్ధమైపోయింది. ఇదే కాకుండా మార్చి 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జీ-20 సదస్సులు జరగనున్నాయి. వీటికంటే ముందే శాసనసభ సమావేశాలను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అంటే 27వ తేదీలోపే ముగిసే అవకాశం ఉంటుంది.ఈ సమావేశాలు అత్యంత ఆసక్తిని రేపుతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. తాను విశాఖకు షిఫ్ట్ అయిపోతానని.. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన ఉంటుందని సీఎం జగన్ కొద్దిరోజుల కిందట ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ వేదికగా జగన్... కీలక ప్రకటన చేసే అవకాశం ఉందన్న చర్చ జోరుగా జరుగుతోంది.

## ఏయూ తెలుగు విభాగంలో ఆహ్వాన వేడుకలు

**ప్రజా తపన**

ఆంధ్రవిశ్వవిద్యాలయ తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థులు యం ఏ తెలుగు మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు స్వాగత వేడుకలను నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య జి యోహాన్ బాబు మాట్లాడుతూ రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సర విద్యార్థులకు ఆహ్వాన వేడుకలు నిర్వహించటం అభినందనీయమని తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబంబించే విధంగా విభాగాన్ని తీర్చిదిద్దటం ఆనందంగా ఉందన్నారు.కొత్త వారిని ఏంతో ఆత్మీయంగా తమ ఇంటికి ఆహ్వానించి అప్యాయత అందించినట్లుగా రెండవ సంవత్సరం విద్యార్థులు చేయటం వలన నాయకత్వ లక్షణాలతో పాటు
గౌరవ మర్యాదలు నేర్చుకుంటారన్నారు.విద్యార్థులలో సృజనశీలత పెంచే ఈ కార్యక్రమాలు వారి భవిష్యత్ జీవితాలను నిర్దేశిస్తాయన్నారు.మంచి ఆలోచనలతో స్నేహశీలతతో విద్యార్థులందరూ కలిసికట్టుగా ఉంటే




ఏదైనా సాధిస్తారని, సమున్నత లక్ష్యాలు సాధించాలంటే సీనియర్ జూనియర్ అనే బేధభావాన్ని వదిలివేయాలన్నారు.తెలుగు సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేస్తే ఏన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని సినిమా,పత్రికా,పర్యాటక రంగాలు ద్వారాలు తెరచి ఎదురుచూస్తున్నాయని విద్యార్థులు మార్కులు కోసం కాకుండా మనస్సు పెట్టి అవగాహనతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చాన్నారు.విద్యార్థులు సదస్సులు,స మావేశాలలో విరివిగా పాల్గొంటూ వివిధ పత్రికలకు వ్యాసాలు పంపటం ద్వారా సృజనశీలతతో పాటు మేధాశక్తి సంపదను పెంపొందించుకోవచ్చాన్నారు.సీనియర్ విద్యార్థులు బాబ్జీ,ఉదయలక్ష్మి,సందీప్,కేదారసాయి జూనియర్ విద్యార్థులకు తమ అనుభవాలతో కూడిన సూచనలు సలహాలు అందించారు.ఆహ్వాన వేడుకలలో భాగంగా జరిగిన ఆటలపోటీలలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేసారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డా అయ్యగారి సీతారత్నం ,డా అన్నంశెట్టి ఈశ్వరమ్మ ,డా బూసి వెంకటస్వామి ,డా కట్టెపోగు రత్నశేఖర్ ,డా పెండ్యాల లావణ్య ,శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర్లు (యోగి ) ,పరిశోధక విద్యార్థులు ,స్నాతకోత్తర విద్యార్థులు ,అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారాలకు ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

పలువురు నేతలు ఈ ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.మంగళవారం మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు జరుగుతాయి. మంగళవారం ఉదయం 11.00 గంటలకు మేఘాలయ (షిల్లాంగ్)లో కోన్రాడ్ సంగ్మా సీఎంగా ప్రమాణ చేస్తారు. అనంతరం నాగాలాండ్‌లోని కోహిమాలో మధ్యాహ్నం 01.45 గంటలకు సీఎంగా నియిఫియు రియో ప్రమాణ స్వీకారం చేస్తారు. మరుసటి రోజు బుధవారం త్రిపురలో మాణిక్ సాహా సీఎంగా ప్రమాణం చేస్తారు. ఈ కార్యక్రమాలు అన్నింటికీ మోదీ హాజరవుతారు. ఈ మూడు రాష్ట్రాలకు సంబంధించి గత ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ రాష్ట్రాల్లో గెలుపు ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ తన పట్టు నిలుపుకోగలిగింది. కాంగ్రెస్ మాత్రం చతికిలపడింది.

## ఏప్రిల్ 1 నుంచి టోల్ చార్జీల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

కిలోమీటరుకు రూ. 2.19 చొప్పున టోల్‌జా ఛార్జీలను వసూలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో 10శాతం వరకు పెరగొచ్చు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై తిరుగుతున్న వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం రోజుకు 20వేల వాహనాలు.. ఈ ఎక్స్‌ప్రెస్‌వేను ఉపయోగించుకుంటున్నాయి. ఆరు నెలల తర్వాత ఈ సంఖ్య 50వేలు- 60వేలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు.. ఢిల్లీ- మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపైనా టోల్ ఛార్జీలు పెరగనున్నాయి.టోల్ ప్లాజ్‌లకు కనీసం 20 కి.మీల రేంజ్‌లో నివాసముండే వారికి నెలవారీ పాస్?లు ఇస్తుంటారు. కాగా.. ఏప్రిల్ 1 నుంచి వీటి ధరలు కూడా కనీసం 10శాతం పెరగొచ్చు. 2022-23 ఆర్థిక ఏడాదిలో ఇది రూ. 315గా ఉంది. దేశంలో గత కొంతకాలంగా అన్ని ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పెట్రోల్?, డీజిల్? ధరలు పెరగపోయినప్పటికీ.. అనేక ప్రాంతాల్లో అవి ఎక్కువగానే ఉన్నాయి. ఇక ఇప్పుడు టోల్? ఛార్జీలను కూడా పెంచుతున్నారన్న వార్తలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## షెహబాజ్ షరీఫ్ అవినీతికి పాల్పడ్డారు

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. లీగల్ విధివిధానాలు పూర్తి చేసి ఇమ్రాన్‌ను అరెస్టు చేస్తారని తెలుస్తోంది. కాగా, అతికష్టం మీద ఇమ్రాన్ నివాసంలోకి ఒక సీనియర్ అధికారి అడుగుపెట్టారని, అయితే అక్కడ ఇమ్రాన్ జాడ కనిపించలేదని పోలీసు వర్గాల సమాచారం. అరెస్టు నుంచి తప్పించుకునే క్రమంలోనే ఆయన తన నివాసానికి దూరంగా ఉన్నారని వారు అనుమానిస్తున్నారు.

## ఉగ్రమూలాలపై ముప్పేట దాడి

(మొదటిపేజీ తరువాయి)

మరిన్ని కఠిన చర్యలు చేపట్టింది. ఉగ్రవాద సంస్థ అల్ ఉమర్ సంస్థ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్‌కు శ్రీనగర్‌లో ఉన్న ఆస్తులను ఎన్ఐయే స్వాధీనం చేసుకుంది. ఆ ఆస్తులు తమ అధీనంలో ఉన్నాయని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసింది. అలాగే బారాముల్లాకు చెందిన బాసిత్ రేషికి చెందిన ఆస్తులను కూడా ఎన్ఐయే జప్తు చేసింది. ఈ ఇద్దరు కూడా ప్రస్తుతం పాక్‌లో తలదాచుకుంటున్న భారత్‌కు చెందిన ఉగ్రవాదులే.హిజ్బుల్ ముజాహిద్దన్ సుప్రీమ్ సయ్యద్ సలావుద్దీన్ వంటి ప్రముఖ ఉగ్రవాదుల విషయంలోనూ ఈ తరహా చర్యలు చేపట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇలాంటి చర్య ఎప్పుడో చేపట్టాల్సిందని కశ్మీర్ సొసైటీ సంఘటన్ వంటి సంస్థలు అంటున్నాయి. ఆస్తుల యజమానుల్లో చాలా మంది 1947లోనే పాక్‌కు పారిపోయిన విషయాన్ని గుర్తు చేస్తోంది.ఈ తరహా ఉగ్రవాదుల సంఖ్య 168 వరకు ఉంటుందని జమ్ము కశ్మీర్ పోలీసులు చెప్తున్నారు.

# జోరుగా కల్తీ నూనె దందా

**ఏలూరు :**



వంట నూనెల కల్తీ వ్యాపారం జోరుగా సాగుతుంది. పలు కంపెనీల బ్రాండ్‌లను వినియోగిస్తూ కల్తీలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పల్లెల నుంచి వస్తున్న ప్రజలకు తక్కువ ధరలకు ఆశ చూపించి నాణ్యతలేని వంట నూనెలను విక్రయిస్తున్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం లలో 31 పైగా వంటనూనెల వ్యాపార సముదాయాలు ఈ దందాకు పాల్పడుతున్నట్లు తెలిసింది.కాకినాడ నుంచి వివిధ రకాల కంపెనీల నూనెను డ్రమ్ముల్లో జిల్లాకు జంగారెడ్డిగూడెం, చింతలపూడి మండలాల వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. పల్లి నూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్, ఇతర తక్కువ ధరలకు లభించే నూనె డ్రమ్ములు హోల్ సేల్ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. సగం వేరు శనగ నూనెలో నాసిరకం నూనెను కలిపి మరో సారి మిల్లులో పోస్తారు. ఆ తరువాత బ్రాండ్ స్టిక్కర్లు అంటించి క్యాన్లలో ప్యాక్ చేస్తారు. అలాగే, లీటర్, అర లీటర్ ప్యాకెట్లు తయారు చేసి జంగారెడ్డిగూడెం, చింతలపూడిలలోని కిరాణా దుకాణాలకు సదరు వ్యాపారులు సరఫరా చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో మార్కెట్, శ్రీనివాసపురం రోడ్డులో కల్తీ నూనెలను విక్రయిస్తూ అమ్మకందారులు జేబులో నింపుకుంటున్నారు. నాణ్యత ప్రమాణాల శాఖ ఉన్నప్పటికీ ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. ఆయిల్ మిల్లుల వ్యాపారులు, హోల్ సేల్‌గా ఆయిల్ తెచ్చి ఇక్కడే ప్యా క్ చేసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. ఈ వ్యాపారంలో ఆరితేరిన కొంతమంది రూ.కోట్లకు పడగలెత్తారు.

# అడ్డు అదుపు లేకుండా ఇసుక అక్రమాలు

**కాకినాడ :**

ఇసుక ఎప్పుడూ డిమాండ్ వున్న వస్తువు. కొంతమంది నేతలు ఇసుక నుంచి కూడా కరెన్సీ పిండేస్తారు. తూర్పు గోదావరిలో ఇసుక అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. సబ్ కాంట్రాక్ట్ లు పేరుతో దోచేస్తున్నారు. అనుమతి లేకుండా కొన్ని చోట్ల, నిబంధనలకు విరుద్ధంగా ఇంకొన్నిచోట్ల అడ్డంగా తవ్వేస్తున్నారు. జిల్లాలో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. కొన్ని చోట్ల అధికార పార్టీ ఛోటా నేతలు.. సబ్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అందిన కాడికి తవ్వుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. బోట్స్‌మన్ సొసైటీలైనా, ఓపెన్ ర్యాంపులైనా? వెనక రాజకీయ నాయకుల హస్తం ఉంటోంది. లారీకి 500 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే అనుచరులు కొన్ని ర్యాంపుల్లో చక్రం తిప్పుతుంటే,ది జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలు వెనుక ఉండి కథ నడిపిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.అనుమతి లేకపోయినా? గోదావరి తీరంలో ఇప్పుడు ఎక్కడ చూసినా పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జరిగిపోతున్నాయి. రాజమండ్రి రూరల్ వెంకటనగరంలోని పట్టా భూముల్లో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. గోదావరి లంక భూముల్లో ఎక్కడ చూసినా ఇసుకాసురులు పెట్టిన గోతులే కనిపిస్తాయి. ఇక సీతానగరం మండలం కాటవరం, వంగలపూడిలో అక్రమాలకు అంతే లేదు.అటు కోనసీమలోనూ.. ఇటు అఖండ గోదావరిలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుంది. కోనసీమలో పలు ర్యాంపులకు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు అనుమతి ఇవ్వలేదు. అయినా అక్రమంగా తవ్వేస్తున్నారు. కోనసీమలోని కొన్ని మండలాల్లో అనుమతి లేకుండానే తవ్వుకుపోతున్నారు. లారీ నెంబర్లతో గోల్‌మాల్ చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఇటు వెంకటనగరం నుంచి కాతేరు వరకూ ఉన్న ఏటిగట్టు ఇప్పటికే ధ్వంసం అయింది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తూర్పుగోదారివరిలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై దర్యాప్తు జరిపితే చాలా పెద్ద తలకాయలే పేర్లు బయటకు వస్తాయని అంటున్నారు స్థానికులు.

# ఆగమాగం..ఆగమాగం...అన్నవరం



**కాకినాడ :**

ప్రతి క్షణం కంటికి రెప్పలా కాపలా కాస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీని పర్యవసానం ఇప్పుడు కాకపోయినా ముందు ముందు తెలియక తప్పదని పలువురు అంటున్నారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అన్నవరం సత్యదేవుని సన్నిధిలో జరుగుతున్న ఈ వ్యవహారంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయలు విలువచేసే స్వామి వారి బంగారు ఆభరణాలు, వజ్ర వైఢూర్యాలను కేవలం భద్రత సిబ్బంది బాధ్యతకే వదిలేసి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని అభియోగాలు ఉన్నాయి.దేవస్థానంలో ఎస్పీఎఫ్, దేవస్థానం, పోలీస్ హోంగార్డులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు వెరసి సుమారు వంద మందికి పైగా ఆలయ పరిరక్షణ కోసం కాపలా కాస్తున్నారు. వీరిలో కొంతమంది గార్డులు ఆలయంలో ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలలో తప్ప మిగతా చోట్ల విధులు నిర్వహించిన దాఖలాలు లేవు. అధికారుల సిఫార్సులతో ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట వేసుకుని కూర్చుంటున్నారని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా అంతరాలయంలో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా ఉంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన ఆలయంలోకి ప్రవేశించే భక్తులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారి వెంట తీసుకొచ్చే బ్యాగులను తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. అయితే, సెల్ ఫోన్లలో చిట్ చాట్ చేస్తూ కాలం గడుపుతున్నారు. దేవస్థానం సెక్యూరిటీ గార్డులు కొంతమంది తూర్పు రాజగోపురం, ప్రధానాలయం, 1500 వ్రతాలు తదితర ప్రదేశాలలో తప్ప మిగతా చోట్ల పనిచేసినట్లు రికార్డులలో ఎక్కడా లేదని తెలుస్తుంది. భద్రత కోసం కాకుండా కేవలం ఆధిపత్యం కోసమే కొంతమంది గార్డులు అయా ప్రదేశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా లక్షల్లో జీతాలు చెల్లిస్తున్న దేవస్థానం అధికార యంత్రాంగం వీరి విధులపై ఎందుకు అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదు.దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని ఎస్పీఎఫ్ సిబ్బంది అంతరాలయం వెలుపల మాత్రమే గస్తీ నిర్వహించాల్సి ఉంది. కానీ ఇక్కడి అధికారుల ఉదాసీనత కారణంగా ఎస్పీఎఫ్ సిబ్బంది అంతరాలయంలోకి ప్రవేశించే భక్తుల దర్శనం టికెట్లను ఇవ్వడం, దేవస్థాన సిబ్బందితో కబుర్లు చెప్పుకోవడం వంటివి నిరంతరం కనిపిస్తూనే ఉంటుంది. నిరంతరం సీసీ కెమేరాలు ఉన్నప్పటికీ అధికారులు వాటిని గమనించకపోవడం విచారకరం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

# కృష్ణాలో పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

**విజయవాడ :**



కిడ్నీ సంబంధిత వ్యాధులు అంటే ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా గుర్తుకొచ్చేది. అయితే ఈ లిస్ట్ లో మరో జిల్లా చేరింది.. ఆ జిల్లాలో తెలుగురాష్ట్రాలకు జీవ నదిలో ఒకటైన కృష్ణా నది ప్రవర్తిస్తోంది.. అయినప్పటికీ సరైన తాగు నీరు దొరక్క.. ఎక్కువ మంది అపరిశుభ్రమైన నీరు తాగి.. కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో జిల్లా వాసులు కృష్ణానది తమ ఊళ్ళ పక్కన ఉన్నప్పటికీ తమకు మంచినీరు అందక ఈ రకంగా కిడ్నీలు పాడై ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం ఏరియాలా ఇపుడు కృష్ణా జిల్లోని అనేక ప్రాంతంలోనూ కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నవారు పెరిగిపోతున్నారు. కృష్ణ జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారు. ఇప్పటికే ఈ వ్యాధిబారిన పడి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. వందలాది మంది చికిత్స తీసుకుంటున్నారు. జిల్లాలోని ఎ.కొండూరు మండలంలో అనేక గ్రామాల్లో కిడ్నీ బాధితులు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. చైతన్యనగర్, దీప్లానగర్, చీమలపాడు, పెద్దతండా, మాన్‌సింగ్ తండా, రేపూడితండా, కంభంపాడు, లక్ష్మీపురం వంటి అనేక గ్రామాల్లోని గ్రామస్థుల్లో వందల కొద్దీ కిడ్నీ వ్యాధిబారిన పడుతున్నారు. ఈ వ్యాధిబారిన పడినవారు చికిత్స కోసం వేలకు వేలు ఖర్చు పెడుతున్నారు. ఇప్పటికే చాలా మంది దయాలసిస్ చేయించుకొంటేగానీ జీవించలేని స్టేజ్ కు వచ్చారని తెలుస్తోంది. అయితే కొంతమంది కిడ్నీ బాధితులు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉండగా ఆర్థిక పరిస్థితి సహకరించక.. దేవుడి మీద భారం వేసి కాలం వెళ్లదీస్తున్నట్లు తెలుస్తోంది.అధికారుల లెక్కల ప్రకారం.. ఎ.కొండూరు మండలంలో 20మంది ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నారు. అయితే డయాలసిస్ చేయించుకున్న వారు సైతం మృతి చెందుతున్నారు. దీంతో చాలా మంది గ్రామస్థులు తమ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులను రక్షించుకోవడం కోసం ఉన్న ఆస్తులను సైతం అమ్మకాన్ని పెడుతున్నారు. నెలల తరబడి చికిత్సనందిస్తున్నారు. తమ ఆర్థిక పరిస్థితికి మించి ఖర్చు పెడుతున్నారు. తమ ఇంట్లో సభ్యులను కాపాడుకోవడం కోసం ఎంత చికిత్స ఇప్పిస్తున్నా ప్రాణాలు దక్కించుకోలేక పోతున్నామని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చీమలపాడు, దీప్లానగర్ తండాలోని పలువురు కిడ్నీ వ్యాధిబారిన పడుతున్నారు. బాధితులకు చికిత్సను అందించడం కోసం బాధిత కుటుంబాలు అప్పు చేసి మరీ లక్షలు ఖర్చు చేశారు. డయాలిసిస్ చేయించుకుంటూనే ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ కుటుంబ సభ్యులకు అప్పులు మిగిలాయి. మరోవైపు కిడ్నీ బాధితులు తమను ప్రభుతం ఆదుకోవాలని.. చికిత్సనందించాలని కోరుతున్నారు. కనీసం తమకు ప్రభుత్వం ఫించను అయినా ఇప్పించమని ఇప్పటికే చాలామంది అధికారులను అడిగామని.. తమ సమస్యను పలువురు నేతలకు విన్నవించుకున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇలా ఈ మండలంలోని వారు కిడ్నీ వ్యాధుల బారిన పడడానికి కారణం.. ఇక్కడ ఉన్న గ్రామాల్లోని తాగునీటిలో ఫ్లోరైడ్, సిలికాన్ అధికంగా ఉండడమే అని అధికారులు ఎప్పుడో గుర్తించారు.. పరిష్కారంగా పరిశుభ్రమైన తాగునీటి అందించేలా కృష్ణానది నీటిని ఇక్కడకు తీసుకుని రావాలని.. ఇప్పటికే పైప్ లైన్స్ కూడా ఏర్పాటు ప్రతిపాదన కూడా చేశారు. అయినప్పటికీ ఎటువంటి ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# అక్కరకు రాని నరేగా

## యధావిధిగా సాగుతున్న వలసలు

**కర్నూలు :**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 8 లక్షల జాబ్ కార్డులున్నాయి. అందులో 18 లక్షల మందికి పైగా ఉపాధి కూలీలున్నారు. వీరంతా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చింది. అయితే ఈ చట్టం పాలకుల పుణ్యమా అని ఆశించిన స్థాయిలో అమలు కావడంలేదు. కరువు మండలాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పనులు కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రతి ఏడాది వలసల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రతి జిల్లాలో లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించింది. అందులో నంద్యాలకు లక్ష, కర్నూలు జిల్లాకు లక్ష మందికి చొప్పున ఉపాధి కల్పించాల్సి ఉంది. అయితే పనులు ప్రారంభించి రెండు నెలలు అవుతున్నా నేటికీ 43 వేలు మించి కూలీలకు పనులు కల్పించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది కూలీలు కుటుంబాలతో సహా పక్క జిల్లాలైన గుంటూరు, ప్రకాశం ప్రాంతాల్లోని దోర్నాల, చిన్న గుమ్మడిపాడు, కుంట, మార్కాపురం, చిన్న గుడిపాడు, గోతంపల్లె, పెద్ద గుడిపాడు, రేమిడిచర్ల, రేగుమాన్ పల్లె వంటి ప్రాంతాలకు మిరపకాయలు తెంచేందుకు వెళ్లారు.వలసల నివారణ కోసం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. వివిధ కారణాలు చూపి కూలీలకు పనులు కల్పించడంలేదు. ప్రభుత్వం ఒకవైపు పెట్టుబడులను ఆకర్శిస్తున్నామంటూగొప్పలు చెప్పకోవడం తప్ప క్షేత్రస్థాయిలో వలసల నివారణ, ఉపాధి అవకాశాలు కల్పించకడం లేదు.ఉపాధి పనుల ప్రారంభ సమయంలో ఒకే ఇంటికి చెందిన ఐదుగురు, ఆరుగురు మందికి కలిసి ఒకే జాబ్ కార్డు ఉంది. నిబంధనల ప్రకారం జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని దినాలు కల్పించాల్సి ఉంది. జాబ్ కార్డులో ఐదుగురుంటే ఒక్కొక్కరికి కేవలం 20 రోజుల పని దినాలు మాత్రమే వస్తున్నాయి. కుటుంబాలు వేరైనా నేటికీ జాబ్ కార్డులు వేరు చేసి ఇవ్వకుండా అధికారులు వివిధ సాకులు చెప్పి తప్పించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.వేసవి ప్రారంభంలో కూలీలకు కల్పించే ఉపాధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అలవెన్సులు కల్పించేది. ఎండల తీవ్రత కారణంగా ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం, జూన్ లో 20 శాతం అలవెన్సలు కల్పించేది. రోజుకు రూ.257ల చొప్పున ప్రభుత్వం కూలి ఇస్తుంది. అందులో 20 నుంచి 30 శాతం పోనూ రోజుకు రూ.180 పని మాత్రమే గిట్టుతుంది. ప్రధాని మోడీ ఈ అలవెన్సులు కట్ చేయడంతోజిల్లాలో ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే వలసలు వెళ్లిన వారికి సమాచారం చేరవేశాం. అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాం. కూలీల సంఖ్యను పెంచేందుకు మరింత కసరత్తు చేస్తున్నాం. చాలా మందికి ఒకే జాబ్ కార్డు ఉండడం వల్ల పని దినాలు తక్కువగా వస్తున్నాయి. వారందరిని దృష్టిలో ఉంచుకుని ఆధార్, రేషన్ కార్డులు ప్రత్యేకంగా ఉంటే వారికి కొత్త జాబ్ కార్డులిచ్చేలా ప్రయత్నం చేస్తున్నామంటున్నారు ప్రాజెక్ట్ డైరక్టర్

# వేసవిలో నీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

**కడప:**



కడప జిల్లాలోని నల్లమల, లంకమల, శేషాచలం అడవులే ఆవాసాలుగా సంచరించే జంతువులకు రక్షణకు అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి ప్రజల నుంచీ సహకారం కోరుతోంది. మండువేసవిలో సైతం తాగునీటికి ఇబ్బందులు ఎదురుకాకుండా సాసర్ పాట్లు ద్వారా నీటి సౌకర్యం, అగ్నికీర్లకు అవి ఆహుతి కాకుండా ఫైర్ లైన్ లు ఏర్పాటు చేయడం లాంటి అనేక కార్యక్రమాలను అటవీ శాఖ చేపడుతోంది.ఉమ్మడి కడప జిల్లాలో 4.59 లక్షలు హెక్టార్లు అటవీ విస్తీర్ణం ఉంది. అందులో 3.15 లక్షల హెక్టార్లు ఎర్రచందనం. ఇక్కడ శేషాచలం, నలమల, లంకమల తదితర అటవీ ప్రాంతాలు ఉన్నాయి.వన్య ప్రాణులు రక్షణ చర్యల్లో భాగంగా జంతు ప్రేమికులతోపాటు మంచి నడవడిక వున్న వారిని అటవీశాఖ ఇన్ ఫార్మర్ గా నియమించుకుంది. వీరితోపాటు అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో అటవీశాఖ నియమించుకున్న ఇన్ ఫార్మర్లకు, గ్రామ ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల పై అవగాహన కల్పిస్తోంది. అటవీశాఖకు సంబంధించి డీఎఫ్ వో, ఎఫ్ఆర్ వో, అటవీ సిబ్బందికి సంబంధించి ఫోన్ నంబర్లను గ్రామాల్లోని గోడలపై రాయించారు. ఎవరైనా వేటగాళ్లు దాడులు నిర్వహిస్తే ఇన్ ఫార్మర్ల ద్వారా వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తున్నారు. రిజర్వు ఫారెస్ట్ లో బావులు, నీటి కుంటలు, చెలమల్లో పూడికలు తీయడం, వాటర్ సోర్స్ అభివృద్ధి చేయడం లాంటి చర్యలు తీసుకుంటున్నారు. వన్యప్రాణుల రోడ్డు దాటే ప్రాంతాల్లో ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే అటవీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుంటారు. వన్యప్రాణల సంరక్షణ కోసం కళాజాత ద్వారా ప్రదర్శనలు ఇప్పించి ప్రజలను చైతన్య పరుస్తున్నారు.వన్య ప్రాణులకు తాగు నీరు దొరక్కపోతే రాళ్లు నాకడం, చెట్ల కొమ్మలు, బెరడు నాకడం ద్వారా నోటికి ముళ్లు గుచ్చుకుంటాయి. నాలుక, నోటి భాగాలు చీలి గాయపడుతూ అనారోగ్యానికి గురవుతుంటాయి. వీటి నివారణ కోసం ఉప్పుగడ్డలు ఏర్పాటు చేశారు. ఒక్కో ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కేజీ బరువున్న 500 నుండి 1000 ఉప్పు గడ్డలు ఏర్పాటు చేస్తారు. మంచినీటి కోసం ఒక్కో ట్యాంకర్ నీటిని 4, 5 సాసర్ పిట్స్ లలో నింపుతారు. ప్రతి రేంజ్ పరిధిలో 50 నుండి 60 సాసర్ పిట్స్ ఉంటాయి. నెలలో 3,4 సార్లు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొస్తారు.వన్యప్రాణులు అగ్నిప్రమాదాల బారిన పడకుండా నేషనల్ బయోడైవర్స్ స్కీం, కంపా, రెడ్ శ్యాండిల్ ప్రొటెక్షన్ పథకం నిధుల ద్వారా ఫైర్ లైన్స్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్క రేంజ్ పరిధిలో 150 నుంచి 200 కిలోమీటర్లు ఈ ఫైర్ లైన్స్ ఉంటాయి.అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అడవులకు నిప్పు పెట్టడం వలన వృక్షజాతి, జంతు జాతి నశించిపోతుంది. వన్యప్రాణుల రక్షణకు కఠినమైన చట్టాలు ఉన్నాయి. ఎవరైనా కావాలని నిప్పు పెడితే మూడేళ్ల జైలు శిక్ష లేదా లక్ష రూపాయలు జరిమానా లేదా రెండు విధిస్తారు. అడవిలో నిప్పునకు సంబంధించిన సమాచారం తెలిస్తే 9000 660708 నంబర్ ను సంప్రదించాలి.

# పెద్ద పులి కూనలు లభ్యం



**నంద్యాల**

నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ కొత్తపల్లి మండలం లో పెద్ద పులి పిల్లలు కలకలం రేపాయి. పెద్ద గుమ్మడాపురం గ్రామంలో నాలుగు పెద్ద పులి పిల్లలను గ్రామస్థులు గుర్తించారు. కుక్కలు దాడి చేసి గాయ పరచకుండా గది లో భద్రపరిచారు. తరువాత అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకున్నారు. తల్లి పులి కోసం అధికారులు గాలిస్తున్నారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత




**ఎన్టీఆర్ జిల్లా**

ఇబ్రహీంపట్నం పోలీసులు రేషన్ మాఫియా కు చెక్ పెట్టారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం నుండి విస్సన్నపేటకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రే తరలిస్తున్నారు అనె పక్కా సమాచారం అందుకున్న స్థానిక ఇబ్రహీంపట్నం పోలీసులు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న బోలోరో వాహనాన్ని మరియు డ్రైవర్ ను, మరి కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒక బొలెరో వాహనాన్ని సిజ్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## రెండు బైకులు ఢీ-వాహనదారులు క్షేమం

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో మంటలు చెలరేగి టీవీఎస్ ఎక్సెల్ దగ్ధమైంది. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో పాల క్యాన్లు తీసుకెళున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనం రోడ్డుపై ఈడ్చుకెళ్ళి మంటలు చేలరేగి కాలి బూడిదయింది. ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తులు దూరంగా పడిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదంలో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## సంగారెడ్డిలో మంత్రి హరీష్ రావు పర్యటన

**సంగారెడ్డి**

మంత్రి హరీష్ రావు సోమవారం సంగారెడ్డిలో పర్యటించారు. సంగారెడ్డి కలెక్టరేట్లో పట్టాలు అందజేసారు. హరిత హారం కింద పెంచిన చెట్లను పరిశీలించారుర. జిల్లా కలెక్టర్ శరత్కు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేసారు. తన పర్యటన నేపథ్యంలో మంత్రి జిల్లా పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. జాతీయ రహదారిపై మురికినీరు ప్రవహించడం పై అసంతృప్తి వ్యక్తం చేసారు. వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## భారీగా విదేశీ మద్యం స్వాధీనం

**మేడ్చల్**

మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు 233 విదేశీ మద్యం సిసాలు, 80,000 ఏనభై వేల నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.వాటి విలువ రూ 12,57,940/ వుంటుందని సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ తెలిపారు. సోమవారం జరిపిన దాడుల్లో ఐదు మంది నిందితులు అరెస్టు చేసారు. మరో నలుగురు నలుగురు నిందితులు పరారీ వున్నారు.నిందితుడు మహిపాల్ రెడ్డి నుంచి 69, రాము నుంచి 96, కృష్ణ కిరణ్ నుంచి 39ప్రవీణ్, భతర్ సింగ్ డిల్లీ నుంచి 44, రాజారామ్ సింగ్, గిడ్డు నుంచి 12 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని అయన వెల్లడించారు.

## కోమటిరెడ్డి వైఖరి మార్చుకోవాలి

**నల్లగొండ**

కోమటిరెడ్డి బెదిరింపు ఆడియో హింసను ప్రేరేపించే విధంగా ఉందని పీసీసీ అదికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ఆరోపించారు. కోమటిరెడ్డికి బిజెపి,బీఅర్ఎస్ నేతలపై లేని కక్ష సొంత పార్టీ నేతలపై ఎందుకు ? కోమటిరెడ్డి ఆడియో వ్యవహారంపై హై కమాండ్ స్పందించాలి. ఇప్పటికైనా కోమటిరెడ్డి వైఖరి మార్చుకోవాలని అయన అన్నారు.

# మార్చి 9న తెలంగాణ కేబినెట్ భేటీ.. కీలక అంశాలపై చర్చ

**హైదరాబాద్ :**



మార్చి 9న తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కానుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన.. మధ్యాహ్నం 2 గంటలకు ప్రగతి భవన్ లో కేబినెట్ భేటీ కానుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. పలు పథకాలు, నిధులు, ప్రభత్వ విధానాలకు సంబంధించి నిర్ణయం తీసుకోనుంది. బడ్జెట్ ఆమోదం కోసం గత నెలలో భేటీ అయిన కేబినెట్.. ఆ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలకు అదే రోజు ఆమోద ముద్ర వేసింది. ఆ భేటీలో కేవలం అన్ని అంశాలపైనే చర్చ జరిగిన నేపథ్యంలో... మరిన్ని అంశాలపైనా కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది.మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలను సమీక్షిస్తోన్న సర్కార్... వాటి ద్వారా ఇంకా ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్ల అర్హత వయసుని తగ్గించి... కొత్త పింఛన్లు మంజూరు చేసింది. కొత్త రేషన్ కార్డులనూ అందించింది. సొంత స్థలం ఉండి.. ఇళ్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు రూ. 3 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని కేసీఆర్ ప్రకటించారు. దీనికి సంబంధించిన విధివిధానాలపై కేబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా ఈ స్కీమ్ ను అమలు చేయాలని చూస్తోన్న ప్రభుత్వం... ఇందుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఎంపికకు సంబంధించిన నిబంధనలు, నిధుల మంజూరు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉంది.నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీపై మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉపసంఘం ఇటీవలే చర్చించింది. రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు లేదా ఇండ్ల స్థలాలు ఇస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. దీని వల్ల కోటి కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. బీపీఎల్ కుటుంబాలకు ఇళ్ల పట్టాల మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2014లో 1.25 లక్షల మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సొంతింటి నిర్మాణంతో పాటు... ఇళ్ల స్థలాల పంపిణీపైనా మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రభుత్వం మోసం చేసింది..వీరజవాన్ల భార్య ఆవేదన

**జైపూర్ :**

2019 పుల్వామా దాడి ఘటనలో 40 మంది సైనికులు అమరులైన సంగతి తెలిసిందే. పుల్వామా దాడి జరిగి మూడేళు గడిచినా అమరులైన జవాన్ల భార్యలకు ఇంత వరకు పరిహారం అందకపోవడం విచారకరం. ఈ క్రమంలో మరణించిన సీఆర్పీఎఫ్ జవాన్ల భార్యలు, కుటుంబ సభ్యులు రాజ్‌భవన్‌కు వెళ్లి మధ్యప్రదేశ్ రాజస్థాన్ గవర్నర్ కల్రామ్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. తాము ఆత్మహత్య చేసుకొనేందుకు అనుమతి ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో చావడం తప్ప తమకు మరో మార్గం లేదంటూ వారు వాపోయారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. తమ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం, తమ భర్తల పేరిట స్మారకాలు నిర్మిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాజ్‌భవన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత నేరుగా రాజస్థాన్ ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఐతే పోలీసులు వారిని లోనికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. పోలీసులు అమర జవాన్ల భార్యలను తోసివేయడంతో వీర జవాన్ రోహితాశవ్ లాంబా భార్య అయిన మంజు గాయపడినట్లు మరో జవాన్ భార్య ఆరోపించారు. కాగా ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కొన్ని రోజులుగా వీర జవాన్ల భార్యలు ధర్నా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బీజేపీ స్పందిస్తూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాల డిమాండ్లను నెరవేర్చడానికి బదులు వారితో దురుసుగా ప్రవర్తించారంటూ ఆరోపించింది.

# ఉత్తర క్రియలు ఊరుకు దూరం

**కిలోమీటర్ల దూరంలో**

**వైకుంఠధామాలు ఏర్పాటు**

**హడావిడి నిర్మాణాలు ఆచరణకు**

**నోచుకోని పథకం**

**సొంత భూముల్లో, పాతశ్మశాన**

**వాటికల్లో అంత్యక్రియలు**

హడావుడిగా చేపట్టిన వైకుంఠధామాల నిర్మాణాలు పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. ఊరికి దూరంగా, చెరువు నీటి నిల్వల ప్రాంతాల్లో, కాల్వలు పారే ప్రాంతాల్లో నిర్మించడంలో ఉత్తర క్రియలు(అంత్యక్రియలు) చేసేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో వైకుంఠధామాల్లో కాకుండా సొంత స్థలాల్లో, పాత శ్మశాన వాటికల్లో కార్యక్రమాలు పూర్తి చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం దూరం కాగా నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల గ్రామానికి కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో అక్కడికి వెళ్లేందుకు నానాయాతన పడుతున్నారు.ఉపాధిహామీ పథకం కింద 2020కి ముందు కూలీలతో కేవలం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు బాగు చేయడం, పిచ్చిచెట్లు తొలగించడం, చెరువులో పూడికలు తీయడం వంటి పనులు చేయించేవారు. 2020లో వైకుంఠధామాల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలపడంతో పాటు వెంటనే నిర్మాణాలు చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళతాయని కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో వైకుంఠధామాల నిర్మాణాలకు నడుం బిగించారు. కనీసం 10 గుంటల భూమిలో వైకుంఠధామం నిర్మించాలని కేంద్రం నిబంధన విధించింది. దీంతో అధికారులు హడావుడిగా ప్రభుత్వ స్థలాల అన్వేషణ ప్రారంభించారు. పాత శ్మశానవాటికల్లో నిబంధనల మేరకు స్థలం ఉంటే అక్కడే నిర్మించగా, లేనిచోట్ల ప్రభుత్వ స్థలాలను కేటాయించారు. జిల్లాలో 14 మండలాలు ఉండగా 215 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 28 గ్రామపంచాయతీలు ఉన్నాయి.ఊరికి దూరంగా...కేంద్ర ప్రభుత్వ నిబంధన మేరకు ప్రభుత్వ స్థలాల కోసం రెవెన్యూ అధికారులు అన్వేషణ చేసి వైకుంఠధామాలకు స్థలాలను కేటాయించారు. అయితే గ్రామాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మారాయి. ముత్తారం (మంథని) మండలం దర్యాపూర్, రామకృష్ణాపూర్ గ్రామంలో రెండు కిలోమీటర్ల దూరంలో వైకుంఠధామం నిర్మించారు. దీంతో అంతదూరం వెళ్లలేక కొంతమంది తమ సాగు భూముల్లోనే ఖననం చేస్తుండగా, మరికొందరు పాతస్థలాల్లో దహన సంస్కారాలు చేస్తున్నారు. దీంతో ఆ వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి.

# రికార్డు పెట్టారని నాకు తెలుసు

**ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**హైదరాబాద్**

నేను భావోద్వేగంతో చేసిన వాఖ్యలే..వేరే ఉద్దేశ్యం లేదని ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత చెరకు సుధాకర్ కొడుకును బెదిరించినట్లు వచ్చిన వార్తలపై అయన వివరణ ఇచ్చారు.
కోమటిరెడ్డి మాట్లాడుతూ 33ఏళ్ళ రాజకీయ ఎప్పుడు నా రాజకీయ ప్రత్యర్థుల పై గాని ఎవరి పై కూడా దూషించలేదు. నా శత్రువులను కూడా దగ్గర తీసే తత్వం నాది. తిట్టాలనుకుంటే రెగ్యులర్ ఫోన్ ఎందుకు చేస్తానని అన్నారు. చదువుకున్న వ్యక్తి గా జనరల్ స్థానం అయిన నల్లగొండ మున్సిపాలిటీ ఛైర్మన్ గా వెంకట్ నారాయణ గౌడ్ కు అవకాశం ఇచ్చాం. నల్లగొండ మున్సిపాలిటీ మూడు సార్లు జనరల్ అయినప్పటికీ ఆ మూడు సార్లు పట్టుబట్టి బలహీన వర్గాల వారికి దక్కేలా చూసా. నేను మాట్లాడిన విషయాలు కట్ చేసారు. కొన్ని అంశాలు మాత్రమే లీక్ చేసారు. రికార్డు పెట్టారని నాకు తెలుసని అన్నారు. పార్టీ లో జాయిన్ అయిన నాటి నుంచి చెరకు సుధాకర్ నన్ను తిడుతున్నాడు. ఎందుకు తిడుతున్నారని అడిగా. చెరకు సుధాకర్ పై పీడీయాక్ట్ పెడితే..నేనే కోట్లాడానని గుర్తి చేసారు. నన్ను తిట్టొద్దని మాత్రమే చెరకు సుధాకర్ కొడుకు కు చెప్పా. అన్యదా భావించొద్దని ప్రజలను కోరుతున్నా. నన్ను సస్పెండ్ చేయాలని ,దరిద్రులు అనడం వల్లే బాధతో మాట్లాడానని వివరణ ఇచ్చారు. నకిరేకల్ లో నా పై పోస్టర్ లు వేసారు. ఎవరు వేసారో తెలుసు. మా వాళ్ళు చంపెస్తారేమోనని భయం తో మాత్రమే చెప్పానని అన్నారు. నా పై చేసిన వాఖ్యలను ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కు,ఇంఛార్జి ఠాక్రే ఫిర్యాదు చేసా. వెంకట్ రెడ్డి ని తిడితే నకిరేకల్ టికెట్ వస్తుందని అనుకుంటుంన్నారు. వీడు, వాడు అని నన్ను సంభోందించవచ్చానని కోమటిరెడ్డి ప్రశ్నించారు. .

# కల్తీపాల గుట్టు రట్టు



**యాదాద్రి భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామంలో కల్తీ పాల తయారు చేస్తున్నారని సమాచారం తో ఎస్వోటీ పోలీసులు దాడులు జరిపారు. బాలం శేఖర్ పాల కేంద్రం పై దాడి చేసి 110 లీటర్ల కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ పాలను తయారు చేసే హైడ్రోజన్ పెరాక్సైడ్ ఒక లీటర్, డాల్పర్ స్మిక్డ్ మిల్క్ పౌడర్ పద్నాలుగు కేజీ ల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

## బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

**నెల్లూరు**

నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు సిటీ బస్సు ఢీ కొని ఒక మహిళ మృతి చెందింది. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వద్ద రోడ్డు దాటుతున్న మహిళలను టౌన్ బస్ ఢీకొంది. ప్రమాదం తరువాత డ్రైవర్ పరార్ అయ్యాడు. సంతపేట పోలీసులు బస్సును స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. మహిళ వివరాలు తెలియాల్సి ఉంది.

## కరెంట్ వైర్లకు తాకిన టిప్పర్ లిఫ్ట్ డ్రైవర్ ను కాపాడిన స్థానికులు

**ఎన్టీఆర్ జిల్లా**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఖిల్లా రోడ్ వద్ద పెను ప్రమాదం తప్పింది. బూడిద అన్ లోడ్ చేసిన ట్రక్ డ్రైవర్ ట్రక్కు లిఫ్ట్ ను కిందకు దింపకుండా టిప్పర్ ని రోడ్ పైకి తీసుకు వచ్చాడు. దాంతో, టిప్పర్ లిఫ్ట్ రోడ్ ప్రక్కన ఉన్న చెట్టుకు, కరెంట్ వైర్ లకు తగిలింది. స్థానికులు నిర్లక్ష్యంగా ప్రవర్తించిన డ్రైవర్ ని స్థానికులు చివాట్లు పెట్టడంతో సదరు డ్రైవర్ టిప్పర్ నుండి దిగుతూ కరెంట్ వైర్ ను ప్రక్కకు తప్పించబోయాడు. కరెంట్ పాస్ అవడంతో షాక్ కి గురైయాడు. దీన్ని గమనించిని స్థానికులు కర్రతో కొట్టి డ్రైవర్ ను కాపాడారు. ఘటన నేసధ్యంలో విజయవాడ, హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

## హరితహారం కింద చెట్లు పెంపకం

**సంగారెడ్డి**

కలెక్టరేట్ లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. తరువాత మహిళలతో కలిసి మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ కొందరు ఓట్ల కోసం చేసే రాజకీయాలు చేస్తారు. కానీ భవిష్యత్ తరాల కోసం సిఎం కెసిఆర్ ఆలోచన చేస్తారని మంత్రి హరీష్ రావు అన్నారు. గురుకుల పాఠశాల ఏర్పాటు, హరితహారం ఇందులో భాగమే. 270 కోట్ల మొక్కలు నాటడం హరిత హారం లక్ష్యం. తెలంగాణ మినహా దేశంలో ఎక్కడా ఊరు ఊరికి నర్సరీలు లేవు. పర్యావరణం దెబ్బతిని ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని అన్నారు.
పర్యావరణాన్ని మెరుగుపర్చేందుకు హరితహారం . ఏడు శాతం గ్రీన్ కవర్ పెరిగిందని కేంద్రమే చెప్పింది. తెలంగాణా తరహాలో రైతు పథకాలు ప్రారంభించాలని ఇతర రాష్ట్రాల రైతులు కోరుతున్నారు. తెలంగాణా ఓ మోడల్ అని అన్నార.

## ప్రీతి ఆత్మహత్య కాదు, హత్యే

**హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డాక్టర్ ప్రీతి మృతి కేసులో ఆమె తండ్రి నరేందర్ నాయక్ సోమవారం నాడు డీజీపీ కి కలవడానికి హైదరాబాద్ వచ్చారు. డీజీపీ కార్యాలయం ముందు అయన మీడియాతో మాట్లాడారు. ప్రీతిది ఆత్మహత్య కాదు. హత్యే నని అన్నారు. మాకు ఎలాంటి టాక్సికాలజీ రిపోర్ట్ రాలేదు. ఈ కేసు పై సమగ్ర విచారణ జరిపించాలని డీజీపీ కి కోరడానికి వచ్చాం. నిందితులకు సరైన శిక్ష పడేలా చూడాలని కోరుతామని అన్నారు. ఆదివారం మట్టేవాడా పోలీసులు మా ఇంటికి వచ్చి విచారించారు. ఘటన పై మరో సారి స్టేట్మెంట్ రికార్డ్ చేశారు. ఒక వేళ టాక్సికాలజీ వచ్చినా కాజ్ ఆఫ్ డెత్ క్లియర్ గా తెలియదు. టాక్సికాలజీ కోసం తీసుకున్న నమూనాలు, అప్పుడే ఎక్కించిన రక్తం నమూనాలు తీసుకున్నారు కాబట్టి సరైన రిపోర్ట్ రాదని డాక్టర్లు చెప్పారు. వరంగల్ లో ఘటన జరిగిన రోజు ఎంజీఎం ఆసుపత్రిలో నమూనాలు తీసుకొని ఉంటే టాక్సీ కాలజీ రీపోర్ట్ సరైన ఫలితం తేలేదని అయన అన్నారు.

ప్రజాతపన
prajathapana.com
News that matters

# అంతా ఆయనే చేస్తున్నారు....

## చంద్రబాబుపై సోము కంప్లయింట్

**రాజమండ్రి :**



పార్టీ నుంచి వెళ్లిపోతున్న వాళ్లంతా ఆయనవైపే వేలెత్తి చూపిస్తున్నారు. ఆయనే కారణమని దుమ్మెత్తి పోస్తున్నారు. ఆయన మాత్రం.. దీనికంతటికీ ఇంకో ఆయన కారణమని ఉత్తరాలు రాస్తున్నారట. నేరం నాది కాదు.. ఆయనదే.. తప్పు నాది కాదు.. కుట్ర అంతా ఆ ఆయనదే? అని చెబుతున్నారట. తప్పించుకోవడానికి చెప్పారా? తప్పు ఆయన మీద తోసేయడానికి చేస్తున్నారో ఏమో.. వ్యవహారం మాత్రం రంజుగా ఉంది.ఏపీ బీజేపీ నుంచి నాయకులు వెళ్లిపోతుంటే.. మౌనంగా ఉన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు.. కామ్‌గా ఢిల్లీ పెద్దలకు లేఖలు రాస్తున్నారట. ఆ లేఖల్లో వీర్రాజు ప్రస్తావిస్తున్న అంశాలే ప్రస్తుతం కాషాయ శిబిరంలో వేడి రాజేస్తున్నాయి. బీజేపీని వీడి నేతలు వెళ్లిపోవడానికి.. బీజేపీ ఇరకాటంలో పడటానికి టీడీపీ అధినేత చంద్రబాబే కారణమని తేల్చేశారట. లేఖలో చంద్రబాబు గురించి వీర్రాజు ప్రస్తావించారని తెలిసి బీజేపీ వర్గాల్లో హాట్ హాట్ చర్చ సాగుతోంది.బీజేపీకి గుడ్‌బై చెప్పిన కన్నా లక్ష్మీనారాయణ.. ఇతర నేతలు.. వీర్రాజు వల్లే వెళ్లిపోతున్నట్టు ఓపెన్‌గానే చెప్పారు. ఎన్నడూ లేని విధంగా కొందరు నాయకులు ఏకంగా ఢిల్లీ వెళ్లి వీర్రాజుపై ఫిర్యాదు చేసి వస్తున్నారు. ఈ పరిణామలతో మొదటికే మోసం వస్తుందని అనుకున్నారో ఏమో.. వీర్రాజు పార్టీ పెద్దలకు లేఖ రాసినట్టు చర్చ జరుగుతోంది. అయితే ఆ లేఖలో చంద్రబాబును బూచిగా చూపించారనే ప్రచారం నడుస్తోంది. ఏపీలో బీజేపీ ఎదగకపోవడానికి.. కన్నా వంటి లీడర్స్ బీజేపీని వీడి వెళ్లిపోవడానికి.. ఇలా అన్నింటికీ చంద్రబాబే కారణమని వీర్రాజు ఆ లేఖలో తేల్చేశారట. చంద్రబాబు జోక్యంతో తమ ప్లాన్ అంతా చెడిపోతున్నట్టు లేఖలో ఆవేదన వ్యక్తం చేశారట వీర్రాజు.బీజేపీ కూటమిని వీడి చంద్రబాబు వెళ్లిన తర్వాత ఆయనపై ఢిల్లీ పార్టీ పెద్దలు గుర్రుగా ఉన్నారు. చంద్రబాబుకు డోర్స్‌కు క్లోజ్ అయినట్టు పలుమార్లు చెప్పారు. ఎలాగూ చంద్రబాబుపై ఢిల్లీ బీజేపీ పెద్దలు ఓ ఓపీనియన్‌తో ఉన్నారని అనుకున్నారో ఏమో.. ఏపీ బీజేపీలో జరుగుతున్న పరిణామాలకు కూడా టీడీపీ అధినేతే కారణమని వీర్రాజు చెప్పినట్టు సమాచారం. ఈ ఎత్తుగడ వీర్రాజుకు పార్టీలో ఏ మేరకు మైలేజ్ తీసుకొస్తుందో ఏమో.. చంద్రబాబును మరోసారి ఈ విధంగా టార్గెట్ చేయడం కాషాయ శిబిరంలో ఆసక్తి కలిగిస్తోంది. కన్నా వంటి నేతలు బీజేపీని వీడి వెళ్లడానికి కూడా బాబే కారణమని వీర్రాజు ముక్తాయించడంతో విస్మయం వ్యక్తం చేస్తున్నారట పార్టీ నాయకులు.బీజేపీని వీడి వెళ్లే నేతలు.. ఏదో ఒక కారణం చూపించాలి కాబట్టి.. బట్ట కాల్చి తనపై వేస్తున్నారనేది వీర్రాజు వాదనగా ఉందట. ఇది కూడా చంద్రబాబు వ్యూహంలో భాగమేనని ఆయన అభిప్రాయమట. ఏపీలో బీజేపీ ఎదిగితే టీడీపీ కష్టమని.. అందుకే ఆ ఛాన్స్ ఇవ్వకుండా బీజేపీపై చంద్రబాబు కుట్ర చేస్తున్నారని అధిష్ఠానానికి వీర్రాజు చెప్పారట. కన్నా తరహాలో బీజేపీని వీడి టీడీపీలో వెళ్లే ఆలోచనలో మరికొందరు ఉన్నారంటూ.. వారి పేర్లను ఆ లేఖలో ప్రస్తావించారట వీర్రాజు.ఆ లేఖ నిజంగా వీర్రాజు రాశారో లేదో తెలియదు. ఒకవేళ వీర్రాజే లేఖ రాసి వుంటే.. తన తప్పు లేదని చెప్పుకోవడానికి ఎప్పటిలా చంద్రబాబును వాడేసుకున్నారా అనేది మరికొందరి డౌట్. వాస్తవానికి ఏపీ బీజేపీలో ఏం జరుగుతుందో ఢిల్లీలోని పార్టీ పెద్దలకు తెలియంది కాదు. వాళ్లకు ఎక్కడి నుంచి సమాచారం అందాలో అక్కడి నుంచి అందుతోంది. ఇప్పుడు వీర్రాజు రాసినట్టుగా చెబుతున్న లేఖపై వాళ్లెలా స్పందిస్తారు? వీర్రాజు మాటలను విశ్వసిస్తారా? లేక తమ దగ్గర ఉన్న నివేదికను వీర్రాజు ముందు పెట్టి నిలదీస్తారా? ప్రస్తుతం జాతీయ రాజకీయాలు.. కొన్ని రాష్ట్రాల్లో జరగబోతున్న ఎన్నికలపై బిజీగా ఉన్న బీజేపీ కేంద్ర నాయకత్వం ఏపీలోని పార్టీ పరిస్థితిపై ఇంకా పూర్తిగా ఫోకస్ పెట్టినట్టు లేదు. ఆ సందర్భం.. సమయం చిక్కగానే ఢిల్లీ పెద్దలు ఎలా స్పందిస్తారో.. ఏం చేస్తారో చూడాలి.

# నక్సల్స్ ఆర్థిక మూలాలపై గురి

**తిరువనంతపురం :**

మావోయిస్టులు రూటు మార్చారా? డబ్బుల్ని డంపుల్లో కాకుండా బ్యాంక్ అకౌంట్లలోనూ, మ్యూచువల్ ఫండ్లలోనూ దాస్తున్నారా? అవుననే అంటోంది.. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ-ఎన్ఐయే. జార్ఖండ్‌కు చెందిన ఓ కేసులో ఏకంగా 152 బ్యాంక్ అకౌంట్లతో పాటు.. 20 కోట్లకుపైగా డబ్బు ఉన్న ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ ఖాతాను అటాచ్ చేసింది. జార్ఖండ్‌లో వామపక్ష తీవ్రవాదానికి సంబంధించిన కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐయే. ఓ సంస్థ, దాని భాగస్వాములు మావోయిస్టులతో దగ్గరి సంబంధం కలిగి ఉన్నారని, వారికి నిధులు సమకూరుస్తున్నారని తేల్చింది.2019లో జార్ఖండ్‌లోని లతేహార్‌లో పోలీసు వాహనంపై దాడి చేసిన మావోయిస్టులు.. నలుగురు పోలీసులను చంపి, వారి దగ్గరున్న ఆయుధాలను లూటీ చేశారు. ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐయే.. సంతోష్ కన్‌స్ట్రక్షన్ భాగస్వాముల్లో ఒకరైన మృత్యుంజయ్ కుమార్ సింగ్‌ను నిందితుడిగా గుర్తించి.. మావోయిస్టులతో అతని సంబంధాలపై ఆరా తీసింది. మావోయిస్ట్ ప్రాంతీయ కమిటీ సభ్యుడైన రవీంద్ర గంజాకు.. మృత్యుంజయ్ కుమార్ సింగ్ డబ్బు సమకూర్చినట్లు తేల్చింది.లతేహార్‌లో పోలీస్ వాహనంపై రవీంద్ర గంజా నేతృత్వంలోని మావోయిస్టుల బృందం దాడి చేయడానికి ఒక రోజు ముందు కీలక పరిణామం జరిగింది. బీర్‌జంఘా అడవిలో మృత్యుంజయ్.. గంజాను కలుసుకున్నాడు. అతనికి 2 లక్షల రూపాయలు ఇచ్చాడని.. ఆ డబ్బుతోనే దాడికి గంజా ప్రణాళిక రూపొందించాడని ఎన్ఐఏ చెబుతోంది. మృత్యుంజయ్ ఇంటి నుంచి కూడా 2.5 లక్షల రూపాయలను ఎన్ఐయే స్వాధీనం చేసుకుంది. మావోయిస్టుల పేరుతో డబ్బు వసూలు చేసి.. వాటిని బ్యాంక్ అకౌంట్లలోనూ, మ్యూచువల్ ఫండ్లలోనూ దాచిపెట్టి.. అవసరమైనప్పుడు మృత్యుంజయ్ మావోయిస్టు లకు ఇస్తూ వస్తున్నాడని ఎన్ఐయే నిర్ధారిం చింది. 152 బ్యాంక్ అకౌంట్లతో పాటు ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ ఖాతాలో ఉన్న 20 కోట్ల రూపాయలకు పైగా నగదును అటాచ్ చేసింది.

# పుష్పను మించిన స్మగ్లింగ్

**హైదరాబాద్ :**

స్మగ్లింగ్ గూడ్స్‌ను అక్రమంగా తరలించడంతో ఈ ముఠా 'పుష్ప' సినిమాలో అల్లుఅర్జున్‌ను మించిపోయాడు. పోలీసుల కళ్లు గప్పి గుట్టుగా అక్రమంగా గంజాయిని తరలిస్తోన్న ముఠా గుట్టును రాచకొండ కమిషనరేట్ పరిధిలోని చౌటుప్పల్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. సీపీ డీఎస్‌చౌహాన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన బానోత్ వీరన్న, హైదరాబాద్ వాసులు కర్రె శ్రీశైలం, కేతావత్ శంకర్ నాయక్, వరంగల్‌కు చెందిన పంజా సూరయ్య ముఠాగా ఏర్పడి గత కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్నారు. ఏపీలోని అన్నవరం నుంచి రాజమండ్రి, ఖమ్మం, తొర్రూరు, తిరుమల్‌గిరి, అడ్డగూడూరు, మోత్కూరు, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్, మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నారు. అందుకు పోలీసులకు అనుమానంరాకుండా డీసీఎం వాహనం లోపల భాగంలో కొన్ని మార్పులు చేసి ఖాళీ ప్రదేశాన్ని సృష్టించారు. అనంతరం ఆ వాహనం కింది భాగంలోని ఖాళీ ప్రదేశంలో గంజాయి ప్యాకెట్లను నింపి.. పైన ఇనుప షీట్లు ఉంచి బోల్టులతో బిగించారు. ఆ వాహనంలో ఇటుకలు, కర్రలు వంటి ఏదో ఒక లోడును తీసుకుని నగరానికి వెళ్లేవారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరుసార్లు గంజాయిని గమ్య స్థానానికి చేర్చారు. పోలీసుల కంట పడకుండా వారి వాహనానికి ముందు హ్యూందాయ్ క్రెటా కారును పంపి.. ఆనక వెనుక గంజాయితో వెళ్లేవారు.ఈ క్రమంలో డీసీఎం వాహనంలో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు.. శనివారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో చౌటుప్పల్‌లోని వలిగొండ చౌరస్తాలో పోలీసులు కాపేశారు. ముందుగా పైలట్‌గా వచ్చిన కారుతోపాటు, డీసీఎంను కూడా పోలీసులు ఆపారు. వాహనాన్ని తనిఖీ చేసే క్రమంలో లోపలి భాగాన్ని కాలితో తన్నిచూడగా శబ్దంలో తేడా వచ్చింది. తర్వాత పోలీసులు చకచకా ఇనుపషీట్లపై బోల్టులు తొలగించడం, లోపలున్న 400 కిలోల గంజాయి స్వాధీనం అంతా జరిగిపోయింది. కారు, డీసీఎంలో వెళ్తున్న మొత్తం నలుగురిని అరెస్టు చేసినట్లు ఎల్బీనగర్‌లో మీడియా సమావేశంలో సీపీ డీఎస్‌చౌహాన్ వెల్లడించారు.

# రధయాత్రకు కమలం నేతలు

**హైదరాబాద్ :**

రథయాత్ర. ఈ పేరు వింటేనే కమలనాథుల్లో కదనోత్సాహం. అప్పట్లో ఎల్‌కే అద్వానీ గుజరాత్ నుంచి అయోధ్య వరకు రథయాత్ర చేపట్టి.. రెండుసీట్ల బీజేపీని.. దేశాన్ని ఏలే స్థాయికి తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ రథయాత్రకు సిద్ధమవుతోంది కమలం పార్టీ.ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో ఇప్పటికే ఐదు దఫాలుగా పాదయాత్ర చేశారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్. ప్రజల నుంచి స్పందన బానే వచ్చింది. ఎందుకోగానీ ఆరో విడత పాదయాత్రకు బాగా గ్యాప్ వచ్చింది. ఈలోగా స్టేట్ కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో అంటూ పాదయాత్రతో తెలంగాణ జిల్లాలను చుట్టేస్తున్నారు. రేవంత్ యాత్రకు భారీ ప్రజాదరణ వస్తోంది. పంచ్ డైలాగులు, మాటల తూటాలతో.. రేవంత్ పాదయాత్రకు మంచి కవరేజ్ వస్తోంది.రేవంత్ దూకుడు చూసి బీజేపీ కంగుతిన్నట్టు ఉంది. వెంటనే తాము యాక్టివ్ కాకపోతే కొంపలు మునిగిపోతాయని పసిగట్టినట్టుంది. అందుకే, గేమ్ ప్లాన్‌ను మార్చేసింది. ప్రజా సంగ్రామ యాత్రల స్థానంలో రథయాత్ర చేయాలని డిసైడ్ చేసింది.సమయం లేదు మిత్రమా అంటోంది కమలదళం. పాదయాత్రలతో నడుచుకుంటూ ప్రజల్లోకి వెళ్లేంత గడువు లేదంటూ.. ముందస్తు ఎన్నికల ఊహాగానాలతో.. రథయాత్రలకు శ్రీకారం చుడుతోంది. కాంగ్రెస్ పార్టీ మాదిరే ప్రముఖ నేతలంతా రథయాత్ర చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఐదు రథాలను రెడీ చేయిస్తున్నారు.ఏప్రిల్ మొదటి వారంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా రథయాత్రలకు బీజేపీ ప్లాన్ చేస్తోంది. పార్లమెంట్ స్థానం పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజవర్గంలో ఒక్కో రోజు యాత్ర చేపట్టేలా రూట్ మ్యాప్ సిద్ధం చేస్తోంది. ఒక్క పార్లమెంట్ ఏరియాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బండి సంజయ్ రథయాత్రల్లో పాల్గొని.. ప్రసంగించేలా వ్యూహం రచించింది. ఇదంతా రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఎఫెక్టే అంటున్నారు.ఈ రథయాత్రల ఐడియా బీజేపీ అగ్రనేత అమిత్‌షా దేనట. ఇటీవల రాష్ట్ర పార్టీ ప్రముఖులను ఢిల్లీకి పిలిపించుకుని మరీ వారికి పార్టీ యాక్షన్ ప్లాన్‌పై దిశానిర్దేశం చేశారు. కర్నాటకలో ఎన్నికలు కంప్లీట్ కాగానే.. ఇక ఫుల్ టైమ్ తెలంగాణపైనే తాను ఫోకస్ చేస్తానని ధీమా కలిగించారు. కాస్త గట్టిగా కొట్లాడితే.. తెలంగాణలో ఈజీగా అధికారంలోకి వచ్చేయొచ్చనేది బీజేపీ అంచనా. అందుకే, ప్రచార వ్యూహాలతో పాటు పార్టీ అంతర్గత సమస్యలపైనా దృష్టి పెట్టారు అమిత్‌షా. నేతల మధ్య మరింత సమన్వయం కుదిరేలా.. ప్రతీరోజూ ఒక నేత ఇంట్లో సమావేశం కావాలని ఆదేశించారు. పార్టీలో చేరికలను సమన్వయం చేసుకునే బాధ్యతలను బన్సల్‌కు అప్పగించారు.ఇలా అంతర్గత వ్యూహాలతో పాటు రథయాత్రలతో ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలనేది బీజేపీ గేమ్ ప్లాన్. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఫుల్ యాక్టివ్ కావడంతో.. కమలం స్పీడును మరింత పెంచేలా.. పాదయాత్ర స్థానంలో రథయాత్రలను రెడీ చేస్తున్నారు. రథసారధి మాత్రం బండి సంజయే. వ్యూహ సారధి అమిత్‌షా.

# రాళ్లు రువ్వుకున్న వైకాపా, తేదేపా నేతలు

**రాప్తాడు**

అనంతపురం జిల్లాలో టిడిపి వైసిపి నేతలు రాళ్ళు రువ్వుకున్నారు. రాప్తాడు అభివృద్ధి పై టీడీపీ కార్యకర్త అజయ్ సజ్జ, వైఎస్ఆర్సీపీ కార్యకర్త హరికృష్ణ రెడ్డి సవాళ్లు విసురుకున్న సంగతి తెలిసిందే. రాప్తాడుకు రావాలని అఅజయ్ సవాల్ విసిరడంతో హరికృష్ణా రెడ్డి రాప్తాడుకు వచ్చి వీడియో పెట్టారు. సోషల్ మీడియా వేదికగా చేసుకొని టిడిపి వైసిపి నేతలు పరస్పరం సవాళ్లు ప్రతి సవాళ్లను విసిరిన అనంతరం వైసిపి నేత హరికృష్ణ రెడ్డి రాప్తాడు చేరుకొని వీడియో రిలీజ్ చేశారు. అనంతపురం టవర్ క్లాక్ వద్దకు వస్తున్నట్లు సమాచారంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వైసిపి, టిడిపి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్కు తరలిస్తున్నారు. ఆ సమయంలో టిడిపి, వైసిపి నేతలు ఒకరి పై ఒకరు రాళ్ళు రువ్వుకున్నారు. రాళ్ల దాడిలో ఓ కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలు అయ్యాయి.

# జాబ్ లెస్ క్యాలెండర్ తో యువతను మోసగించిన జగన్

**ఎమ్మిగనూరు**



అధికారంలోకి రాగానే మొట్టమొదట ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని టిడిపి నేతలు తెలిపారు. మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి×గారి ఆదేశాల మేరకు వారు సోమవారం టిడిపి నేతలతో కలిసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న భూమిరెడ్డి రామగోపాలరెడ్డిని గెలిపించాలని ఎమ్మిగనూరు పట్టణంలో మున్సిపల్ 13,14 వార్డులలో మరియు ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు విద్యాసంస్థలలో పట్టభద్రులను, ఉద్యోగులను కలుసుకొని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి "జాబ్ లెస్ క్యాలెండర్" విడుదల చేసి నిరుద్యోగ యువతను మోసం చేశారని ఆరోపించారు. వైయస్సార్సీపి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు అవుతున్నా ఒక్క డీఎస్సీ జరపలేదని మండిపడ్డారు. నారా చంద్రబాబు నాయుడు తన హాయంలో.. రెండు డీఎస్సీలు జరిపి 17,591 ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వ మోసపూరిత విధానాల కారణంగా గత మూడేళ్లలో వందలాది మంది నిరుద్యోగ యువకులు నిరాశ, నిస్పృహలకు గురై ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన చెందారు. చంద్రన్న పాలనలో... 10 లక్షల కు పైగా ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ఆరు లక్షల మందికి నిరుద్యోగ భృతి ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదన్నారు. మార్చి 13న జరుగు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల్లో.. తెలుగుదేశం పార్టీ బలపరుస్తున్న భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి మొదట ప్రాధాన్యత (1) ఓటు వేసి గెలిపించి నిరుద్యోగ యువత గొంతును శాసన మండలి లో వినిపించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బనవాసి ఆదినారాయణ రెడ్డి,కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి. అల్తాఫ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, అడ్వకేట్ కె.టి. మల్లికార్జున, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, పట్టణ టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు కె.యం.డి. జబ్బార్, మాదిరే పీర్ బాషా,గో రా బాషా, మహబూబ్ బాషా, ఆఫ్గన్ వలి భాష, జహంగీర్, బంగారు షాప్ యూసుఫ్ ,16 వ వార్డు టిడిపి నాయకులు బెస్త హనుమంతు, పట్టభద్రుడు సందెపోగు రామన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాలంటీర్ల ప్రచారం

## ఈసీ కీ కనిపించడం లేదా

**గోనెగండ్ల**

మండల కేంద్రమైనా గోనెగండ్లలో మార్చి 6 సోమవారము వైసీపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేయడంలో వాలంటీర్లు దర్శనం ఇవ్వడం ఎన్నికల అధికారులకు కనిపించడం లేదా అని టీడీపీ మండల కమిటీ సభ్యులు చిన్నానేలాటూరు నాగన్న,మండల టీడీపీ యూత్ మండల అధ్యక్షులు రంగస్వామినాయుడు, సందీప్ నాయుడు, జయపాల్,గోవర్ధన్ నాయుడు ప్రశ్నించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నేడు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాలంటీర్లను అడ్డం పెట్టుకొని గెలుద్దామని వైసీపీ వ్యూహ చేసినట్లు అర్థం అవుతుందని అన్నారు.కేవలం ప్రభుత్వ పథకాలు మాత్రమే ప్రజలకు చేరువ చేసేందుకే ప్రభుత్వ వేతనం చెల్లించి మరీ వాలంటీర్లను నియమించారని అలాంటిది ఒక రాజకీయ వైసీపీ పార్టీకి తొత్తుగా ఉపయోగించుకోడం ఏమిటని ప్రశ్నించారు.కేంద్ర ఎన్నికల ఆదేశాల మేరకు వాలెంటీర్లు ఏ రాజకీయ పార్టీకీ ప్రచారం చేయడం గాని,పాల్గొనడం కానీ చేయకూడదు అనే నిబంధన వున్నా అధికారుల అలసత్వం,వైసీపీ నాయకుల బరితెగింపు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు.వాలంటీర్లు లేనిదే గెలవలేం అనే దుస్థితికీ వైసీపీ పార్టీ వచ్చిందని,వారు లేకుంటే మమ్మల్ని ఓటర్లు గుర్తుపట్టాలెరేమో అని నాయకులు భయపడుతున్నారని అన్నారు.గోనెగండ్ల మండలంలో ఏ వాలంటిర్లు వైసీపీ తరుపున ప్రచారం చేస్తే వారి ఫోటో తీసి ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు.ఏ వాలంటీర్ అయినా అధికార పక్షానికి తొత్తుగా ప్రచారం చేయాలి అనుకుంటే తమ వాలంటీర్ స్థానానికీ రాజీనామా సమర్పించి పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఇప్పటికైనా ఎన్నికల అధికారి వైసీపీ ప్రచారంలో పాల్గొనే వాలంటీర్ల పై చర్యలు తీసుకోవాలని అలాగే,కేంద్ర,రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## జిల్లాకో మెడికల్ కాలేజీ

**సంగారెడ్డి**

సంగారెడ్డిలోని జిల్లా మెడికల్ కాలేజీ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. తరువాత, మెడికల్ కాలేజీలో ఈ లైబ్రరీని ప్రారంభించారు. మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో 83 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీల్లో రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాలో తొలిస్థానంలో ఉంది. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలే ఉండేది. ఇప్పుడు రాష్ట్రంలో మెడికల్ కాలేజీ సంఖ్య 17 కు పెరిగింది. జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ప్రారంభించాలన్నది ప్రభుత్వ లక్ష్యంమని అన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి

**అంబర్ పేట**

ఇటీవల అంబర్ పేటలో కుక్కల దాడిలో మరణించిన నాలుగేళ్ల బాలుడు ప్రదీప్ మృతికి జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారహితమైన చర్యల వల్లనేనని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నాడు అంబర్ పేటలోని ఎరుకల బస్తీలో కుక్కల దాడిలో చనిపోయిన నాలుగేళ్ల బాలుడు( ప్రదీప్) కుటుంబ సభ్యులను కిషన్ రెడ్డి పరామర్శించారు.
మృతి చెందిన బాలుడు తల్లిదండ్రులకు ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు, బిజెపి కార్పొరేటర్ల తరపున మరో లక్ష రూపాయల చెక్కును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అందజేశారు అదే విధంగా మృతిచెందిన బాలుడి అక్క చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని తెలిపారు

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు....

**కమాన్ పూర్**

పాలకుర్తి మండలం జిడి నగర్‌సర్పంచ్, కేశోరామ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు సూర సమ్మయ్య, కన్నాల గ్రామ శాఖ అధ్యక్షులు, గన్ శామ్దాస్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరారు. ఉమ్మడి కన్నాల బిజెపి పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన మౌటం రవి, దండుగుల సమ్మయ,బికే సాగర్,అభి బాగు,దేశం సహూ, మందల సంపత్ రెడ్డి, బదవత్ బలు నాయక్,బీమా నాయక్, దేవ్ నాయక్, సమ్మయ నాయక్, వారిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఏఐసీసీ కార్యదర్శి శాసనసభ్యులు మాజీ మంత్రి శాసనసభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్న ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా, ఈ ప్రాంత సమస్యలపై పోరాటం కొనసాగిస్తా, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకి ప్రతి ఒక్కరు పనిచేయాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో కన్నాల, గన్ శ్యామ్ దాస్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు బూతగుడ్డల రమేష్,సంపంగి సమ్మయ్య, బంల నాయక్ తండ ఉపసర్పంచ్ శంకర్ నాయక్, గండికోట వెంకటేష్, కేశోరామ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య యాదవ్, కన్నాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కలవెన శ్రీనివాస్, శంకరయ్య,రాజు నాయక్ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ లో ఇద్దరు విద్యార్థులు గల్లంతు ఒక మృతదేహం లభ్యం

**ఏలూరు**

పశ్చిమగోదావరి జిల్లా పేరుపాలెం బీచ్ లో విషాదం చోటుచేసుకుంది. బీచ్ లో ఎంజాయ్ చేసేందుకు వచ్చిన పెన్నాడ ఇంజనీరిం గ్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. వీర్ని కందుకూరి మణికంఠ, నికిత్ గా గుర్తించారు.. వీరిలో ఒకరిది విజయనగరం కాగ,మరో విద్యార్థిది రాజమండ్రి ..ఇద్ద రు హాస్టల్ లో ఉండి బీటెక్ చదువు తున్నారు. గల్లంతైన కొద్దిసేపటికి లిఖిత్ మృత దేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మరొక విద్యార్థి కోసం మత్స్యకారులు సముద్రం లో గాలిస్తున్నారు

## అధికారంలోకి వస్తే పాత పెన్షన్ స్కీమ్

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్**


కాంగ్రెస్ పార్టీ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్ రెడ్డి ని గెలిపించండని ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. టీచర్ల సంక్షేమం కోసం పోరాడే కెపాసిటీ ఉన్న నేత హర్షవర్ధన్ రెడ్డి. రాజస్థాన్ మాదిరిగా ఇక్కడ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి.. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ తీసుకొస్తాం. 317 జీవో వల్ల కోల్పోయిన స్థానికతను తీసుకొస్తాం. కేజీబీవీ టీచర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలి. టీచర్ల ప్రమోషన్ ల విషయంలో టీ.ఆర్.ఎస్ ప్రభుత్వం అవమానవీయంగా వ్యవహరిస్తోంది. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.మేం అధికారంలోకి వస్తే.. నెల మొదటి రోజే జీతాలు పడేలా చూస్తాం.టీచర్ల తరపున గెలిచిన వారు.. అధికార పార్టీ లో చేరి .. టీచర్లను పట్టించుకోలేదు.హర్షవర్ధన్ రెడ్డి 18 ఏళ్లు టీచర్ గా పని చేసిన అనుభవం ఉంది.. టీచర్లు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# భూముల సమాచారం కోసం

## టీఎస్ బీ పాస్ ద్వారా చెక్...

**హైదరాబాద్ :**

ఇటీవలికాలంలో అత్యధిక శాతం మంది తమ పెట్టుబడులను... భూములపై పెడుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో ప్లాట్స్ లపై ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. భూములు, ప్లాట్ల రేట్లు వృద్ధి చెందుతున్న నేపథ్యంలో.. ఆదాయానికి ఇదే మంచి మార్గంగా చాలా మంది భావిస్తున్నారు. అయితే.. కొంత మంది భూముల విషయంలో ప్రజలని తప్పుదోవ పట్టించి నిండా ముంచుతు న్నారు. వ్యవసాయ, కన్జర్వేషన్ జోన్ లలో ఉన్న భూములను కూడా ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు ఆ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకొని లబోదిబోమం టున్నారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భూములకి సంబంధించి పూర్తి సమాచారం తెలుసునేందుకు సరికొత్త వేదికను అందుబాటులోకి తీసుకొచ్చింది.భవన నిర్మాణాలకు సత్వర అనుమతుల కోసం తీసుకొచ్చిన టీఎస్ బిపాస్ ద్వారా ఇకపై... భూ వినియోగ వివరాలనూ ప్రజలకు అందించనుంది. తొలుత జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని సర్వే నంబర్లలో ఉన్న ల్యాండ్ యూజ్ స్టేటస్ ని వెల్లడించనుంది. దీని ద్వారా సర్వే నంబర్లతో పాటు... ఆయా సర్వే నంబర్లు ఏ జోన్ లో ఉన్నాయో తెలుసుకోవచ్చు. రెసిడెన్షియల్, కమర్షి




యల్, పారిశ్రామిక, వ్యవసాయం, రీక్రియేషనల్, కన్జర్వేషన్ జోన్ల భూముల వివరాలు రాబట్టవచ్చు. భూములు కొనుగోలు చేయడం.. లేదా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టు ప్రారంభించాలని అనుకున్న వారు... టీఎస్ బిపాస్ ద్వారా ఆయా ల్యాండ్స్ కి సంబంధించిన సమగ్ర సమాచారం కోరవచ్చు. పూర్తి వివరాలు వచ్చిన తర్వాత ముందడుగు వేయడంపై నిర్ణయం తీసుకోవచ్చు. వ్యక్తిగత సమాచారం, సర్వే నంబర్లు, గ్రామం - మున్సిపాలిటీ తదితర వివరాలు నమోదు చేయాలి. పూర్తి వివరాలు ఎంటర్ చేసిన తర్వాత దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క దరఖాస్తు ద్వారా 5 సర్వే నంబర్ల వివరాలు తెలుసుకోవచ్చు. ఒక్కో సర్వే నంబర్ కోసం రూ. 500, ప్రాసెసింగ్ ఫీజు కింద రూ. 100 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు అందిన తర్వాత... సర్వే అధికారులు సమగ్ర పరిశీలన జరిపి.. 21 రోజుల్లో భూ వినియోగ వివరాలు, అనుమతులకి సంబంధించిన పూర్తి వివరాలను దరఖాస్తుదారుడికి అందజేస్తారు. అన్ని సమగ్రంగా ఉన్నాయనుకుంటే ... వినియోగదారులు కొనుగోలు లేదా ప్రాజెక్టు ప్రారంభించేందుకు ప్రొసీడ్ అవ్వొచ్చు. భవన నిర్మాణాల అనుమతుల కోసం.. టీఎస్ బిపాస్ ద్వారానే దరఖాస్తు చేసుకొని పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది .జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో అమలు చేస్తున్న ఈ విధానం ద్వారా వచ్చే ఫలితాలను విశ్లేషించి.. రానున్న రోజుల్లో ఫేజ్ 2 లో డీటీసీపీ పరిధిలోనూ అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. భూ వినియోగ వివరాలను ఇప్పటి వరకు డీపీఎంఎస్ వ్యవస్థ ద్వారా సిటిజన్లు పొందే వారు. అయితే... భవన నిర్మాణాల అనుమతులు, లే అవుట్ పర్మిషన్స్, ల్యాండ్ యూజ్ డీటెయిల్స్ వంటి సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకి తెచ్చేందుకే... టీఎస్ - బీపాస్ లో నూతన సర్వీసెస్ చేర్చామని అధికారులు చెబుతున్నారు.

# యాత్రా స్థలాల్లో గిరిజన స్టాల్స్

**అదిలాబాద్ :**

స్వచ్ఛమైన తేనేకు పెట్టింది పేరు ఆదివాసీల ఖిల్లా ఆదిలాబాద్ . దేశ వ్యాప్యంగా టాప్ బ్రాండ్ లు సైతం కల్తీ తేనెను మార్కెట్ చేస్తున్నాయంటూ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ రిపోర్ట్ లు చెపుతుంటే కేవలం ఒకే ఒక్క తేనె మాత్రం అందరిని నమ్మకాన్ని పెంచుకుంటూ నోరూరించే రుచిని.. అంతకు మించిన ఆరోగ్యాన్ని అందిస్తూ భళా అనిపించుకుంటోంది. అదే టీఎస్‌జీసీసీ ఆద్వర్యంలో కొనసాగుతున్న గిరితేనె. నిర్మల్ లో కొనసాగుతున్న ఈ గిరితేనె యూనిట్ తెలంగాణలోని తొలి సహజ తేనె సేకరణ యూనిట్. ఈ యూనిట్ లో రోజుకు 300 లీటర్ల సామర్థ్యంతో తేనె సేకరణ కొనసాగుతోంది. అడవుల నుండి ఆదిమ గిరిజనులు సేకరించిన స్వచ్ఛమైన పుట్ట తేనె ఉట్నూర్ , నార్నూర్ , ఇంద్రవెల్లి , భద్రాద్రి కొత్తగూడెం నుండి ఈ యూనిట్ కి చేరుతోంది. ఈ తేనెలో పుష్కలమైన ఔషధ విలువలతో పాటు ఆయుర్వేద లక్షణాలు ఉండటంతో డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోంది. ఈ గిరిహనీ అగ్‌మార్క్ నుండి స్పెషల్ గ్రేడ్ తో పాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ ధృవీకరణను సైతం పొందింది.నిర్మల్ గిరిహనీ యూనిట్ లో ప్రాసెస్ చేసిన ఈ తేనెను ప్లాస్టిక్ సీసాలలో ప్యాక్ చేసి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలిస్తున్నారు. స్వచ్ఛమైన తేనెను హోల్‌సేల్ డీలర్లకు కిలోకు 250 రూపాయలకు విక్రయిస్తుండగా, రిటైల్ అవుట్‌లెట్లలో కిలోకు రూ. 360 కి విక్రయిస్తుండగా.. యాత్రా స్థలాల్లోను ఈ గిరి తేనె స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మరో వైపు వినియోగదారుల గుమ్మవద్దకే స్వచ్ఛమైన గిరి తేనెను అందించేందుకు టీఎస్‌జీసీసీ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో నిన్న మొన్నటి వరకు దేశానికే పరిమితం అయిన ఆదివాసీల గిరి హనీ.. విదేశాలకు సైతం చేరుతోంది. ఇటు తెలంగాణలోని హైదరాబాద్ గిరి బజార్ తో పాటు గా అన్ని జిల్లా కేంద్రాల్లోని తెలంగాణ రాష్ట్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు ఔట్‌లెట్లలో ఈ గిరితేనె అందించేందుకు సమాయత్తం చేస్తున్నారు. దీంతో వేలాది మంది గిరిజనులకు ఉపాధి కలుగుతోంది.ఈ స్వచ్ఛమైన తేనె లో కాల్షియం, రాగి, ఇనుము, మెగ్నీషియం, మాంగనీస్, భాస్వరం, పొటాషియం, జింక్, సల్ఫర్, సోడియం, సిలికాన్ వంటి ఖనిజ లవణాలతో పాటు.. థైమిన్, రిబోఫ్లావిన్, పైరిడాక్సిన్, పాంటోథెనిక్ యాసిడ్, నికోటెనిక్ యాసిడ్? లాంటి విటమిన్లూ పుప్పొడి ద్వారా చేరిన ప్రోటీన్లూ అమైనోఆమ్లాలూ ఎంజైములూ దండిగా ఉన్నాయని.. గిరి హనీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యులు సైతం కితాబిస్తున్నారు. ప్రాసెస్ చేయకుండా నేరుగా తేనెపట్టు నుంచి తీసిన జుంటి తేనెలో ఎంజైములు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా దొరకుతాయని చెపుతున్నారు. ఈగిరితేనెను రోజు తీసుకుంటే ఆరోగ్యపరంగా మరెన్నో లాభాలుంటాయని చెపుతున్నారు నిపుణులు. ఇంకెందుకు ఆలస్యం కల్తీ లేని స్వచ్ఛమైన గిరిహనీని మీరు మీ ఇంటికి తెచ్చుకొండి.

# ఖాళీ అవుతున్న మిడ్‌మానేరు

**వరంగల్:**

ఇటీవల సీఎం కేసీఆర్ ప్రారంభించిన మల్లన్న సాగర్‌కు నిరంతరాయంగా నీళ్లు ఎత్తిపోస్తుండడంతో మిడ్‌మానేరు క్రమంగా ఖాళీ అవుతోంది. దీంతో అందులో మునిగిన పాత ఊళ్లన్నీ ఒక్కొక్కటే బయటపడుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మిడ్?మానేరు నుంచి అనంతగిరి, రంగనాయకసాగర్, తడ్కపల్లి పంపుహౌస్‌ల ద్వారా మల్లన్నసాగర్‌కు 13 టీఎంసీల వాటర్ ఎత్తిపోశారు. 50 టీఎంసీల కెపాసిటీ ఉన్న ఈ రిజర్వాయర్ మొదటిసారి పూర్తిస్థాయిలో నింపాల్సి ఉంటుందని, ఇందుకు కనీసం రెండేళ్లు పట్టే అవకాశముందని ఇంజినీర్లు చెబుతు న్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మిడ్‌మానేరు ప్రాజెక్టు కెపాసిటీ 27.5 టీఎంసీలు. కొద్దిరోజులుగా ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని విడుదల చేస్తుండటంతో మిడ్ మానేరులో నీటి నిల్వ క్రమంగా తగ్గుతోంది. దీంతో



రిజర్వాయర్?లోని వరదవెల్లి, కొదురుపాక, నీలోజిపల్లి తదితర గ్రామాలు తేలుతున్నాయి. రోడ్లు కూడా క్లియర్‌గా కనిపిస్తుండడంతో నిర్వాసితులు వారి గ్రామాల్లో కొద్దిసేపు గడిపి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. కొందరు ఇండ్ల గోడలపైకి ఎక్కి ఉద్వేగానికి లోనవుతున్నారు. మిడ్ మానేరులో నీళ్లు తగ్గిపోతుండడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది మేడారం లిఫ్ట్ ద్వారా 6 టీఎంసీలు లిఫ్ట్ చేశారు. మరో 3 టీఎంసీలు తరలించనున్నట్టు ఆఫీసర్లు చెబుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఫుల్ కెపాసిటీ 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 12 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నీటి మట్టం మరింత తగ్గితే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి లిఫ్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. మిడ్ మానేరులో మా ఊరు నీలోజిపల్లి మునిగిపోయింది. ప్రాజెక్టు నిండా నీళ్లు ఉండడంతో ఇన్నాళ్లూ మా గ్రామాన్ని చూడలేకపోయాం. కొన్ని రోజులుగా ప్రాజెక్టు నుంచి నీటిని మల్లన్నసాగర్?కు పంపుతుండడంతో పాత గ్రామం తేలింది. దీంతో ఊరు చూసేందుకు వచ్చినం. మొండి గోడలు చూస్తే కన్నీళ్లు ఆగుతలేవు. ఉన్న ఊరును, కట్టిన ఇండ్లను వదిలేసి వెళ్లిన మాలాంటి వాళ్లకు ప్రభుత్వం ఎంత చేసినా తక్కువే.మిడ్ మానేరు ప్రాజెక్టులో మా ఊరితోపాటు చాలా గ్రామాలు మునిగిపోయాయి. నీళ్లు తగ్గడంతో మా ఊరు క్రమంగా తేలుతోంది. దీంతో పాత గ్రామాన్ని చూసేందుకు వచ్చినం. ఆ దృశ్యాలు చూస్తుంటే పాత జ్ఞాపకాలతో ఆనందం, బాధ ఒకేసారి కలుగుతున్నాయని చెబుతున్నారు.

## రుణమాఫీలో రైతులకు మొండిచెయ్యి

**తిరుమలగిరి**

తిరుమలగిరి లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన కింద ఇచ్చిన 2 లక్షల ఇళ్లను ప్రజలకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయింది. నాణ్యతలేని డబల్ బెఆడ్ రూమ్ ఇల్లు ప్రారంభానికి ముందే కూలిపోతున్నాయి. రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులకు మొండి చేయి చూపించింది బి అర్ స్ ప్రభుత్వం. రైతు, పేదల ద్రోహి బి ఆర్ ఎస్ ప్రభుత్వం. ఆర్టీసీ చార్జీలు, ఆస్తి పన్ను, భూమి పన్నులు పెంచుతూ గ్యాస్ ధర పెరిగిందని ప్రలోభాలు పలుకుతున్నది బీ.ఆర్.ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. కేసుల పాలు కాకుండా బిడ్డను కాపాడుకోవడం కోసం కేసీఆర్ పదరాన్ని పాట్లు పడుతున్నాడు. రాష్ట్రం లో ఎక్కడికి వెళ్లినా మూడు సమస్యలు వినపడుతున్నాయి. డబుల్ బెడ్ రూమ్, ధరణి మరియు రుణ మాఫీ. రాత్రి 1 గంట తర్వాతనే ధరణి పోర్టల్ తెరుచుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మద్యం అమ్మకాల పైనే ఆధారపడింది. కేసీఆర్ కుమార్తె కూడా మద్యం వ్యాపారం పైనే ఆధారపడింది. లిక్కర్ స్కామ్ నుండి తన కుమార్తెను కాపాడుకోవడం కోసమే కేసీఆర్ ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అరెస్ట్ గురించి మాట్లాడుతున్నాడు. లిక్కర్ స్కామ్ చార్జి షీట్ లో కవిత పేరు నాలుగు సార్లు వచ్చింది. మోడీ నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వం కేసీఆర్ కి భయపడదు. పార్లమెంటు సభ్యునిగా ఉన్నప్పుడు కూడా ఫోర్జరీ సంతకాలు పెట్టిన చరిత్ర కేసీఆర్ దని అన్నారు.

## ఘనంగా దంత వైద్యుల దినోత్సవం

**కాకినాడ**

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ దంత వైద్యం మన మొత్తం ఆరోగ్యానికి అంతర్లేనంగా ఉంటుందన్నారు. ముఖం నిండుగా అందంగా కనిపించాలంటే దంతాలు సక్రమంగా ఉండాలన్నారు. ముఖం అందంగా ఉండి పలువరస సక్రమంగా లేకపోతే ఆత్మన్యూనతా భావానికి గురి అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణ , సతీష్, సువర్ణ రాజు, రఘురాం లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ఎస్. శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆదుకున్నవారికి ఆవార్డులు, రివార్డులు

**మదనపల్లె**

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వ్యక్తులను 108, అంబులెన్స్ కోసం వేచి చూడకుండా సరైన సమయంలో ఆసుపత్రికి చేర్చే వారికి గుడ్ సమరిటన్ అవార్డుతో పాటు ఐదు వేల రూపాయలు అందించడం జరుగుతుందని డిఎస్పీ కేశప్ప తెలిపారు. నేడు మదనపల్లె టుటౌన్ పోలీస్టేషన్ నందు ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టుటౌన్ సిఐ మురళీకృష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో ఎవరి ప్రాణాలు పోకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కావున ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ఈ అవార్డును అందుకోవాలని కోరారు.

## మెకానిక్ షెడ్ లో అగ్ని ప్రమాదం

**మదనపల్లె**

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులోని దర్గా వద్ద ఉన్న మెకానిక్ షెడ్డులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సమయానికి చుట్టుపక్కల షెడ్ల వారి సహకారం, ఫైర్ ఆఫీసు వారి కృషితో మంటలు వ్యాపించకుండా అదుపు చేయడంతో ప్రాణ నష్టం జరగలేదు. నేటి మధ్యాహ్నం ఆ ప్రాంతంలో ఉన్న చెత్త కుప్పలకు మంటలు అంటుకున్నాయి. ఈ మంటలు విపరీతంగా వ్యాపించడంతో మెకానిక్ షెడ్లకు మంటలు వ్యాపించాయి. షెడ్లలో ఆయిల్, పెట్రోలు వంటివి సహజంగా ఉండటంతో మంటలను అదుపు చేయలేక పోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో ఐదు కార్లు, షెడ్లలోని సామాన్లు అగ్నికి ఆహుతి అయ్యాయి.

## స్పందన లో అర్జీలు స్వీకరణ

**కడప**

ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా సోమవరం అధికారులు అర్జీలను స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్లోని సభాభవన్ లో.. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్వో గంగాధర్ గౌడ్, డ్వామ, డిఆర్డీఏ పీడిలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# బేగం ఎయిర్ పోర్టులో పరిశోధనా కేంద్రం

**హైదరాబాద్ :**

రూ.400 కోట్లతో బేగంపేట విమానాశ్రయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'పౌర విమానయాన పరిశోధనా కేంద్రం' రూపుదిద్దుకుంటోంది. రతదేశంలో తొలి 'గృహ-5' ప్రమాణాలతో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆసియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పరిశోధనా కేంద్రం రూపుదిద్దుకుంటోంది. ఇది పూర్తి అయితే 2023 జులై నుంచి ఇక్కడ పరిశోధనలు ప్రారంభంకానున్నాయి.తెలంగాణ రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం మరో భారీ బహుమతిని ఇచ్చింది.రూ.400 కోట్లతో బేగంపేట విమానాశ్రయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'పౌర విమానయాన పరిశోధనా కేంద్రం' రూపుదిద్దుకుంటోంది. దీని కోసం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భారతదేశంలో తొలి 'గృహ-5' ప్రమాణాలతో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆసియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పరిశోధనా కేంద్రం రూపుదిద్దుకుంటోంది. ఇది పూర్తి అయితే 2023 జులై నుంచి ఇక్కడ పరిశోధనలు ప్రారంభంకానున్నాయి. దేశంలోని తొలి విమానయాన పరిశోధన కేంద్రం ఇది. భారతదేశంలో తొలి 'గృహ-5' ప్రమాణాలతో ఈ కేంద్రం ఆసియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణమవుతోంది. 2023 జూలై నుంచి పరిశోధనలు ప్రారంభించడమే లక్ష్యంగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి.బేగంపేటలోని 27 ఎకరాల్లో 2018లో ఈ కారోకు శంకుస్థాపన జరిగింది. అప్పటి కేంద్ర మంత్రి సురేష్ ప్రభు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైపౌర విమానయాన పరిశోధన సంస్థకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా పరిశోధన, విమానయాన అభివృద్ధి, ఎయిర్ నావిగేషన్ సర్వీసెస్, ఎయిర్ ట్రాఫికింగ్ మేనేజ్మెంట్ కమ్యూనికేషన్స్ డొమైన్ ఎమ్యులేషన్ , నెట్‌వర్క్ ఎమ్యులేటర్, అనాలసిస్ ల్యాబ్స్ ఏర్పాటవుతాయి. అంతేకాకుండా ప్రమాద విశ్లేషణ కేంద్రం, సైబర్ సెక్యూరిటీ ల్యాబ్, డేటా మేనేజ్మెంట్, ప్రాజెక్ట్ సపోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సెంటర్‌లు కూడా ఈ కేంద్రంలో ఉంటాయి.ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా రూ. 402.13 కోట్ల వ్యయం అంచనాతో సిద్ధం చేస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా పరిశోధన, విమానయాన అభివృద్ధి, ఎయిర్ నావిగేషన్ సర్వీసెస్, ఎయిర్ ట్రాఫికింగ్ మేనేజ్మెంట్ కమ్యూనికేషన్స్ డొమైన్ ఎమ్యులేషన్ , నెట్‌వర్క్ ఎమ్యులేటర్, అనాలసిస్ ల్యాబ్స్ ఏర్పాటకానున్నాయి. అంతేకా?గ..ప్రమాదాల విశ్లేషణ కేంద్రం, సైబర్ సెక్యూరిటీ ల్యాబ్, డేటా మేనేజ్మెంట్ , ప్రాజెక్ట్ సపోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సెంటర్ లను ఈ కేంద్రం కలిగి ఉంటుంది.పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన పలు భవనాల పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి. రూ.402 కోట్ల అంచనాతో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మిస్తోంది. ఇక్కడ పరిశోధన సదుపాయాలతోపాటూ ఎయిర్‌పోర్ట్స్ ఎయిర్ నావిగేషన్ సేవలు, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్స్ డొమైన్ సిమ్యులేటర్స్, నెట్‌వర్క్ ఎమ్యులేటర్, విజువలైజేషన్, అనాలసిస్ ల్యాబ్‌లు, సర్వైలెన్స్ ల్యాబ్స్, నావిగేషన్, సిమ్యులేషన్స్ ల్యాబ్‌లు రానున్నాయి. సైబర్ సెక్యూరిటీ, థ్రెట్ అనాలసిస్ ల్యాబ్స్, డాటా మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ సపోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెంటర్లు రానున్నాయి. ఇక్కడే ఏవియేషన్ విశ్వవిద్యాలయం కూడా త్వరలో ఏర్పాటుకానుంది.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మరణం

**నెల్లూరు**

కలకత్తా చెన్నై జాతీయ రహదారిపై కాగితాలపూరు క్రాస్ రోడ్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా మనుబోలు మండలం పిడూరు గ్రామానికి చెందిన వెంకయ్య అనే 25 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు . మనుబోలు పోలీసులు సమాచారం మేరకు పిడూరు గ్రామానికి చెందిన వెంకయ్య కు తల్లిదండ్రులులేకపోవడంతో అతని సోదరుడుతో కలిసి నివసిస్తూ వరి కోత మిషన్ లో యాక్టింగ్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు . అతని మోటార్ సైకిల్ లో పెట్రోల్ నింపుకునేందుకు కాగితాల పూర్ క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు కు మోటార్ సైకిల్ పై వెళుతుండగా క్రాస్ రోడ్ వద్ద గుంటూరు నుండి తిరుపతి వెళు తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు ఉంది దీంతో వెంకయ్య అక్కడికక్కడే మృతిచెందగా ఆయన మృతదేహాన్ని గూడూరుకు తరలించి మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తా...

**స్వతంత్ర అభ్యర్థి కమ్మూరు నాగరాజు**

**కడప**



పట్టభద్రులారా ఆలోచించండి మన ఓటు మనకు అండ, మీ ఓటు స్వార్ధపరులకా, లేక మంచి చేసేవారికా అంటూ రాయలసీమ పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కమ్మూరు నాగరాజు అన్నారు. సోమవారం ఈ సందర్భంగా వైయస్సార్ ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య చదివి కష్టాల్లో పుట్టి పెరిగి పేదరికం అంటే ఏమిటో కల్లారా చూసిన వాడిని, వీలైనంత త్వరగా కుటుంబాలను పేదరికం నుంచి గట్టి ఎక్కించాలని తపన పడుతూ 25 సంవత్సరాలు ఎన్నో పెద్దపెద్ద ప్రముఖ కంపెనీలలో సేవలు అందించి అనుభవంతో సాంకేతికంగా యువతకు సవాలక్ష మార్గాలు చూపాలన్న కసితో మన సొంత జిల్లా అయిన అనంతపురాని కి వచ్చి స్థిరపడ్డానని తెలిపారు. అతి పెద్ద వ్యవస్థ రాజకీయ వ్యవస్థ కాబట్టి తాను రాయలసీమ పట్టభద్రులకు నిరుద్యోగ సమస్య ఉన్నందున అందుకు నన్ను ఎన్నుకొని శాసనమండలికి పంపితే సమాజానికి మంచి సందేశాన్ని అందించే వాడిని అన్నారు. రాయలసీమ పట్టభద్రుల నిరుద్యోగుల సమస్యల కొరకు శాసనమండలిలో పోరాడుతానని మాటిచ్చారు.మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో రాయలసీమ పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కమ్మూరు నాగరాజు అను నాకు మీ మొదటి ప్రాధాన్యత అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని రాయలసీమ పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రైట్స్ ఫోరం అధ్యక్షులు దస్తగిరి, మానవ హక్కుల యెన్ జాకీర్ హుస్సేన్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొట్టం సుబ్బారావు, ఏపి వేప రాష్ట్ర కార్యదర్శి రేనాటి శ్రీనివాసులు, భారతీయ వాల్మీక సేన వసంత్, దళిత వేదిక జిల్లా కార్యదర్శి వెదురూరు బాబు, దళిత వేదిక వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు

# మధ్యతరగతి వారికి అద్భుత అవకాశం

**గోపవరంలో జగనన్న స్మార్ట్ టౌన్షిప్**

**30.42 ఎకరాల విస్తీర్ణంలో అన్ని**

**సదుపాయాలతో లేఅవుట్**

**60 అడుగుల మెయిన్ రోడ్డు**

**40 అడుగుల అంతర్గత రోడ్లు**

**ఆడ చైర్మన్ సింగ సాని గురు మోహన్**

**బద్వేలు**




మధ్యతరగతి వారికి ప్రభుత్వం అద్భుత అవకాశం ఇచ్చినట్లు ఆడా చైర్మన్ సింగ సాని గురు మోహన్ తెలిపారు. బద్వేలు నియోజకవర్గంలోని పట్టణంలో అంతర భాగమైన గోపవరం మండలంలో చేపడుతున్న జగనన్న స్మార్ట్ టౌన్షిప్ బద్వేల్ ప్రాంతానికి కలికితిరాయిగా మిగులుతుందని ఆయన తెలిపారు. అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ లేఔట్లకు మధ్యతరగతి వారు ఎవరైనా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సెంచరీ ప్లే వుడ్ సమీపంలో జాతీయ రహదారి కి 100 మీటర్ల దూరంలోనే ఈ లేఔట్ ఉండడం అత్యంత విశేషమని గురు మోహన్ తెలిపారు. రాజధానికి వెళ్లే మార్గం కావడంతో ఇక్కడ భూముల ధరలు పెరిగినప్పటికీ కనీస ధరలకే ఫ్లాట్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మౌలిక వసతుల కల్పనకే 15 కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. సొంతింటి కల నెరవేర్చుకోవడానికి ఎంతోమంది సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నట్లు ఆయన తెలిపారు. వారి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ టౌన్ షిప్ ను అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. అర్హత ఉన్నవారుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కడప ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు రాయచోటిలో జగనన్న స్మాట్ టౌన్షిప్ ఏర్పాటు చేయగా స్థలాలన్నీ హాటు కేకుల అమ్ముడు అయినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో గోపవరం మండలం రెండవది కాగా వైయస్సార్ జిల్లాలో ఇది మొదటిదని తెలిపారు. ప్రస్తుతం ఈ స్థలాన్ని గుర్తించి పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించారు టెండర్లు పూర్తయిన తర్వాత పనులు ప్రారంభమవుతాయి. త్వరలో రాజంపేట పులివెందుల రైల్వే కోడూర్ పొద్దుటూరు జమ్మలమడుగు కడప నియోజకవర్గాల్లో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.. ఇప్పుడు బద్వేలు నియోజకవవర్గం గోపవరంమండలం గోపవరం గ్రామ రెవెన్యూ పొలమునందు సర్వే నెంబర్ 1755/1 2 3 4 5 6 1756/1 నుంచి 1756/5 వరకు 1759/ ఐదు వరకు 1759/1 నుంచి 1760/ 1 2 3 4 5 6 7 వరకు గల 30:42 ఎకరాల విస్తీర్ణంలో జగనన్న స్మార్ట్ టౌన్షిప్ ఏర్పాటు చేస్తున్నారు ప్రభుత్వం ప్రతిపాదించిన తక్కువ ధరతో సొంత ఫ్లాట్లు పొందేందుకు అవకాశం కల్పించారు. ఈ లేఔట్ కు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా హెల్త్ డిపార్ట్మెంట్ ఉంటుంది డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ తో ఇది ఆమోదింపబడింది

## అర్హతలు

ఒక కుటుంబానికి ఒక ప్లాట్ మాత్రమే ఇస్తారు. సంవత్సరాల ఆదాయం 18 లక్షలు లోపు ఉండాలి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన మార్గదర్శకాలను అనుసరించి దరఖాస్తుదారులు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తప్పనిసరిగా నివాసులై ఉండాలి. దరఖాస్తుదారుడి ఆధార్ కార్డు చిరునామా చెల్లుబాటులో ఉండాలి.

## నగదు చెల్లింపు ప్రక్రియ

ఆసక్తిగల దరఖాస్తుదారులు ఆన్లైన్ ద్వారా వెబ్సైట్ నందు సరైన వివరాలు నమోదు చేసి ప్లాట్ కేటగిరి మొత్తం విలువలో 10 శాతం డిపాజిట్ గా చెల్లించాలి. నమోదు ప్రక్రియ తర్వాత కంప్యూటర్ ద్వారా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయిస్తారు. కేటాయింపు జరగని వారికి డిపాజిట్లు నెలలోపు ఎటువంటి వడ్డీ లేకుండా వెనక్కిస్తారు. దరఖాస్తుదారునికి ప్లాట్ కేటాయించిన తర్వాత అతను నిర్ణీత సమయంలో అగ్రిమెంట్ చేసుకోకపోతే ప్రాథమిక డిపాజిట్ జమ చేసుకుంటారు. ఆ ప్లాట్ ను రద్దుచేసి అర్హత కలిగినవారికి కేటాయిస్తారు. 10 శాతం విలువ చెల్లించి ప్లాట్ కేటాయించబడిన వారు అగ్రిమెంట్ చేసుకున్న తేదీ నుంచి ఒక నెలలోపు ప్లాట్ అమ్మకము విలువలో 50 శాతం చెల్లించవలసి ఉంటుంది. ఆ తరువాత ఆరు మాసాలకు మరో 30 శాతం, సంవత్సరంలోపు మిగిలిన 30% చెల్లించాలి. దీంతో మొత్తం విలువ చెల్లించినట్లు అవుతుంది. అగ్రిమెంట్ చేసుకున్న తేదీ నుంచి నెలలోపే ప్లాట్ మొత్తం అమ్మకం విలువ 100% చెల్లిస్తే ఐదు శాతం తగ్గింపు ఇస్తారు. దరఖాస్తుదారులు ఆలస్యంగా చెల్లింపులు చేస్తేప్రతి స్టేజీలోనూ 0.5 శాతం ఒక నెలకు సామాన్య వడ్డీ వసూలు చేస్తారని గురు మోహన్ తెలిపారు.ప్లాట్ ధరలు మూడు దశల్లో ఇలా ఉన్నాయి రూ 8.25 లక్షలు, రూ 11 లక్షలు, రూ 13.2 లక్షలు ఉన్నాయి.

# వలసలకు వెళ్ళిన వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**కౌతాళం**




గ్రామాలలో వలసకు వెళ్ళిన వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, డబ్బులు, బ్యాంకుల్లో లేదా మీ కుటుంబ సభ్యుల దగ్గర భద్రంగా దాచుకోవాలని ప్రజలకు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ నెల ఒకటవ తేదీన బధినేహాల్ గ్రామానికి చెందిన ఫిర్యాది శేఖమ్మ ఇంట్లో మధ్యాహ్నం తోటకి వెళ్లిన తర్వాత ఇంటి తాళం పగలగొట్టి దొంగతనం జరిగిందని ఇచ్చిన ఫిర్యాది మేరకు, దర్యాప్తు చేసి దొంగలించిన బాధినేహాల్ గ్రామానికి చెందిన ఏరిగేరి రామాదాస్ ని సోమవారం పోలీస్ సిబ్బంది వీరేష్, మధు, శ్రీరాములు లతో ముద్దాయి ని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి సుమారు 45 తులాల వెండి మరియు 2 తులాల బంగారు ఆభరణాలను మరియు పదివేల రూపాయల డబ్బులను స్వాదీనం చేసుకుని రిమాండ్ కి తరలిస్తమని తెలిపారు. పోలీస్ సిబ్బంది కి కుటుంబ సభ్యులు అభినందలు తెలిపారు.

# ఇంటర్ విద్యార్థులకు టెలిమానస్ సేవలు

**హైదరాబాద్ :**




పరీక్షల కాలం రావటంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారు. ఈ క్రమంలో ఒత్తిడిని భరించలేక పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో ఉంచుకొని... తెలంగాణ ఇంటర్ బోర్డులు కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల్లో మానసిక స్థైర్యం నింపాలన్న ఆలోచనతో 'టెలి-మానస్' (టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండర్ నెట్‌వర్కింగ్ అక్రాస్ ది స్టేట్స్)సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా విద్యార్థులకు సైకాలజిస్టులతో సేవలు అందించనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఇంటర్ పరీక్షలు, ఫలితాల నేపథ్యంలో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు 'టెలి-మానస్'కు కాల్ చేసి నిపుణులతో కౌన్సిలింగ్ తీసుకోవచ్చని ఇంటర్ బోర్డు పేర్కొంది. ఇందుకోసం వైద్యారోగ్యశాఖకు చెందిన టెలీ మానస్ సేవలను ఉచితంగా వినియోగించుకొనే తెలిపింది. విద్యార్థులు 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని వెల్లడించింది. ఈ టెలి మానస్ ద్వారా విద్యార్థులు పరీక్షలను ఎదుర్కోవడానికి కావాల్సిన విశ్వాసాన్ని, ధైర్యాన్ని ఇవ్వడమేగాక మార్గదర్శనం చేయనున్నట్టు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. భయం, ఆందోళన, ఒత్తిడిని దూరం చేసేందుకు ప్రయత్నిస్తారని... ఇవే కాకుండా ప్రభుత్వ దవాఖానల్లో జిల్లా మెంటల్ హెల్త్ క్లినిక్‌ల సేవలను 24 గంటల పాటు ఉచితంగా వినియోగించుకోవచ్చని వివరించింది.: మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్ మొదటి, రెండో సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష మార్చి 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష మార్చి 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు జరుగుతుంది. థియరీ పరీక్షలు.. మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్చి 15న మొదలై.. ఏప్రిల్ 3న ముగుస్తాయి. రెండో సంవత్సర విద్యార్థులకు మార్చి 16న మొదలై.. ఏప్రిల్ 4న ముగుస్తాయి. థియరీ పరీక్షలన్నీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి.

# శ్రీవారి సేవలో నూతన దంపతులు మంచు మనోజ్, భూమా నాగమౌనికా రెడ్డి

**తిరుమల**



తిరుమల శ్రీవారిని నూతన వధూవరులు మంచు మనోజ్, భూమా నాగ మౌనిక రెడ్డిలు దర్శించుకున్నారు.. సోమవారం ఉదయం విఐపి విరామ సమయంలో మనోజ్ దంపతులతో మంచు లక్ష్మి దంపతులు కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతూ...మౌనిక తో వివాహం అనంతరం తిరుమలకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.. జీవితంలో ఎందులోనైనా ఓడిపోవచ్చు కానీ ప్రేమలో కాదు.. నేడు మా ప్రేమ గెలిచిందన్నారు.. మా నాన్నగారి ఆశీస్సులు., అక్క సపోర్ట్., అత్తమామల ఆశీస్సులు మాపై ఉన్నంత వరకు ఎవరు ఏమి చేయలేరని తెలిపారు.. వరుసగా షూటింగ్లు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు.. రాజకీయాల్లో వచ్చే ఆలోచన నాకు లేదని, ప్రజలకు సేవ చేయాలనీ మాత్రమే ఉందని అన్నారు.. మౌనిక చేయాలనీ అనుకుంటే తనకి నా సపోర్ట్ ఉంటుందని స్పష్టం చేసారు.. మున్ముందు ఇద్దరం కలసి మరిన్ని సేవ కార్యక్రమాలు చేయాలి అనుకుంటున్నామన్నారు.. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని అంటారని, అలా నా జీవితంలోకి మౌనిక రెడ్డి వచ్చిందన్నారు.. గత నాలుగేళ్లుగా వేరే లోకంలో ఉన్న నన్ను మల్లి తిరిగి తీసుకొచ్చిందని తెలిపారు.. ఒకరికి ఒకరు తోడు ఉండాలని కోరుకున్నామన్నారు.. అందుకే శివుని ఆజ్ఞతోనే అన్ని జరిగాయని అనుకుంటున్నానని, బాబు నేను మౌనిక రెడ్డిలు నూతన జీవితంలోకి అడుగుపెట్టామన్నారు.. కలిసి వచ్చే కాలం వస్తే నడిచి వచ్చే కొడుకు పుడతాడు..అది ఇదేనేమో అంటూ తన ఆనందాన్ని వ్యక్త పరిచారు..

ప్రజాతపన
prajathapana.com

# మాస్ మహారాజా రవితేజ 'రావణాసుర' స్టైలిష్ అండ్ గ్రిప్పింగ్ టీజర్ విడుదల



మంచి క్రైమ్ థ్రిల్లర్ ని చూడటం కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తాం. థ్రిల్లర్స్ మెదడుకు కూడా పదును పెడతాయి. మాస్ మహారాజా రవితేజ 'రావణాసుర'తో మొదటిసారి పూర్తి క్రైమ్ థ్రిల్లర్ ని ప్రయత్నించారు. థ్రిల్లర్ జానర్ లో సినిమాలు తీయడంలో స్పెషలిస్ట్ అయిన సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రమిది. టైటిల్ తోనే క్యూరియాసిటీ సృష్టించి, హీరోలు లేరనే ట్యాగ్‌లైన్ తో రవితేజ మంచివాడా, చెడ్డవాడా? అనే ఆసక్తిని మరింత పెంచింది.

మేకర్స్ ఈ రోజు టీజర్ తో ముందుకు వచ్చారు. టీజర్ రవితేజను మల్టీ షేడెడ్ క్యారెక్టర్ లో ప్రజంట్ చేసింది. ఒక నేరస్థుడు ఒక అమ్మాయిని వెంబడించడంతో టీజర్ ప్రారంభమవుతుంది. తర్వాత ఫ్రేమ్ లో ఒక అమ్మాయి శరీరం మొత్తం రక్తంతో విగతజీవిగా పడి ఉన్నట్లు చూపిస్తుంది."ప్రతి క్రిమినల్ వాడు చేసిన క్రైమ్ మీద వాడి సంతకం వదిలేసి వెళ్లిపోతాడు... ఆ సంతకం కోసం వెతకండి..."అంటూ హత్య కేసును ఛేదించే అధికారిగా పాత్రలో జయరామ్ చెప్పిన డైలాగ్ మరింత క్యూరియాసిటీని పెంచింది.

రవితేజ లాయర్ గా పరిచయం అయ్యారు కానీ డిఫరెంట్ షాట్స్ పాత్రలో యూనిక్ నెస్ ప్రజంట్ చేస్తోంది. ఈవిల్ స్మైల్ ఇవ్వడం, ఫెరోషియస్ గా చూడటం, యాక్షన్ లోకి వచ్చినప్పుడు గర్జించడం ఆసక్తికరంగా వున్నాయి. చివరగా సుశాంత్ పరిచయం అయ్యాడు. "సీత ని తీసుకెళ్లాలంటే సముద్రం దాటితే సరిపోదు... ఈ రావణాసురుణ్ణి దాటి వెళ్లాలి..." అంటూ రవితేజ వార్నింగ్ ఇచ్చారు.

రవితేజ పాత్రలో చాలా షేడ్స్ ఉన్నాయి. తన ఎక్స్ టార్డినరీ పెర్ఫార్మెన్స్ తో అలరించారు.రవితేజ ఎనర్జీకి మారుపేరు. రావణాసురుడిగా నెక్స్ట్ లెవల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. తెరపై రవితేజని అలా చూడటం కనువిందుగా వుంది. టీజర్ లో సుశాంత్ లిమిటెడ్ స్క్రీన్ టైం పొందినప్పటికీ తన ఇంపాక్ట్ చూపాడు. జయరామ్ ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ గా ఆకట్టుకున్నారు.

# శర్వానంద్, శ్రీరామ్ ఆదిత్య, టీజీ విశ్వ ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 35 అనౌన్స్ మెంట్



తన గత చిత్రం 'ఒకే ఒక జీవితం'తో అందరికీ ఎమోషనల్ ట్రీట్ ఇచ్చిన ప్రామిసింగ్ హీరో శర్వానంద్ పంథా మార్చారు. ముందుగా, అదనపు కేలరీలను కోల్పోవడానికి, షార్ప్ ఫిజిక్ ని బిల్డ్ చేసుకోవడానికి కొంత విరామం తీసుకున్నారు. రెగ్యులర్ స్టఫ్ చేయకూడదని కూడా నిర్ణయించుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా అనౌన్స్ చేసిన శర్వానంద్ 35 వ చిత్రం ఒక యూనిక్ పాయింట్ తో ఫ్యూచరిస్టిక్ ఎంటర్‌టైనర్ గా ఉండబోతోంది. టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్ శ్రీరామ్ ఆదిత్య స్టైలిష్ బెస్ట్ లుక్ లో శర్వానంద్‌ను ప్రెజెంట్ చేయనున్నారు. న్యూస్ పేపర్ యాడ్ లా రూపొందించబడిన పోస్టర్‌లో శర్వా ఫంకీ, స్లీక్, ఎలిగెంట్ గా కనిపిస్తున్నారు. ఇది చాలా ఇంటరెస్టింగ్ కాంబినేషన్. టాలీవుడ్‌లో అత్యంత విజయవంతమైన నిర్మాతలలో ఒకరైన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టీజీ విశ్వ ప్రసాద్ చశర్వా35ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ బ్యానర్ లో చివరిగా విడుదలైన ధమాకా సంచలన విజయం సాధించింది.

చూష్ట్రజీతీలిజీ35 కి వస్తే, చిత్రీకరణ కొనసాగుతోంది. పోస్టర్ లో చూపిన కోఆర్డినేట్‌లు- 51.5055ళీ ఔ, 0.0754 ళీ చి జఐ లోని లండన్ ను లొకేషన్ గా సూచిస్తున్నాయి. సినిమాలో శర్వానంద్ క్యారెక్టర్ ఎంత క్రేజీగా ఉండబోతుందో పోస్టర్ స్పష్టం చేస్తోంది. ఈ పాత్రకు మేకోవర్ జస్ట్ వావ్ అనిపిస్తోంది.

క్రేజీ కాంబినేషన్ లో రూపొందే ఈ చిత్రానికి అత్యంత ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పని చేయనున్నారు. మలయాళ కంపోజర్ హృదయం ఫేమ్ హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. డీవోపీ విష్ణు శర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ప్రముఖ టెక్నీషియన్ ప్రవీణ్ పూడి ఎడిటర్ కాగా, జానీ షేక్ ఆర్ట్ డైరెక్టర్.

ఇతర వివరాలను మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.






Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950